E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 29-04-2025 (వారం) మంగళవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



గ్రూప్-1 పిటిషనర్లకు తెలంగాణ హైకోర్టు జరిమానా » 2లో

# ఖజానా ఖాళీ చేసి మాపై నిందలా..?



## కేసీఆర్‌పై మండిపడ్డ సీఎం రేవంత్‌రెడ్డి

- ఎల్కతుర్తి సభలో కేసీఆర్ తన అక్కసు మొత్తం వెళ్లగక్కారు.
- తెలంగాణ ప్రజలు భారాసను నమ్మే స్థితిలో లేరు
- పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ఎమ్మెల్యేలదే
- చేసిన పనులు చెప్పుకోవడంలో వెనుకబడ్డాం
- నాకు, రాహుల్ కి మధ్య మంచి రిలేషన్ ఉంది
- ఈ విషయంలో ఎవర్ని నమ్మించాల్సిన అవసరం లేదు

### ఎల్కతుర్తిలో జరిగిన భారాస రజతోత్సవ సభపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు.

ఈ కబురు, హైదరాబాద్: ఎల్కతుర్తిలో జరిగిన భారాస రజతోత్సవ సభపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కేసీఆర్ ప్రసంగంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన ప్రసంగం అక్కసుతో కూడుకున్నదని ఆరోపించారు. ''కేసీఆర్ ఖజానాను ఖాళీ చేసి మాపై నిందలు వేస్తున్నారు. భారాసను నమ్మే స్థితిలో ప్రజలు లేరు. కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడారు. ఆయన ప్రసంగంలో స్పష్టత లేదు. రాహుల్‌గాంధీకి, నాకు గ్యాప్ ఉందనడం అవాస్తవం. రాహుల్‌కు, నాకు ఉన్న అనుబంధం ప్రపంచానికి చెప్పనవసరం లేదు. అవసరాలను బట్టి కేసీఆర్, మోదీ మాటలు మారుస్తున్నారు. దేశానికి ఇందిరా గాంధీ లాంటి ప్రధాని కావాలి'' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ''ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలి. ఎమ్మెల్యేలు వెళ్తేనే.. ప్రజల్లోకి పథకాలు వెళ్తాయి. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయి. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే పార్టీ నేతలే నష్టపోతారు'' అని రేవంత్ హెచ్చరించారు.

తరువాయి 2లో

## పార్టీ నిర్ణయం తర్వాతే.. ప్రభుత్వం విధానం: ఆపరేషన్ కగార్‌పై సీఎం రేవంత్

ఈ కబురు,హైదరాబాద్: మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా భద్రతా దళాలు చేపట్టిన ఆపరేషన్ కగార్‌పై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం (ఏప్రిల్ 28) మాజీ మంత్రి జానారెడ్డి ఇంటికి సీఎం రేవంత్ రెడ్డి వెళ్లారు. ఆపరేషన్ కగార్, మావోయిస్టుల అంశంపై ఆయనతో డిస్కస్ చేశారు



» 2లో

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన కాబోయే సీఎస్ రామకృష్ణారావు



తరువాయి 2లో

## పద్మ భూషణ్ అవార్డు అందుకున్న బాలకృష్ణ



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా బాలకృష్ణ పద్మ భూషణ్ అవార్డు అందుకున్నారు. » 2లో

ఈ కబురు,: ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పద్మ భూషణ్ అవార్డు అందుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనకు పురస్కారం అందజేశారు. రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల వేడుక జరిగింది. గణతంత్ర దినోత్సవం వేళ కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలు ప్రకటించిన సంగతి తెలిసిందే.

## రాజ్‌భవన్‌లో లోకాయుక్త, ఉపలోకాయుక్త ప్రమాణస్వీకారం




**ఈ కబురు,హైదరాబాద్:**
రాజ్‌భవన్‌లో తెలంగాణ లోకాయుక్త, ఉప లోకాయుక్త ప్రమాణస్వీకారం చేశారు. లోకాయుక్తగా జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, ఉప లోకాయుక్తగా బీఎస్ జగ్జీవన్ కుమార్‌తో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. »2లో

» 3లో

## ఇక అలలపై 'రఫేల్

ఎం' గర్జనలు.. నౌకాదళానికీ అత్యాధునిక ఫైటర్ జెట్‌లు



## క్రిమియాపై జెలెన్‌స్కీ దారికొస్తాడు: ట్రంప్

» 3లో



## చరిత్ర సృష్టించిన సూర్యవంశీ..

» 6లో



## పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

» 2లో



## మావోయిస్టు అగ్రనేత అభయ్ సంచలన లేఖ



»2లో

## జిమ్‌లో వర్కౌట్ చేస్తుండగా కేటీఆర్‌కు గాయం



జిమ్‌లో వర్కౌట్ చేస్తుండగా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు గాయమైంది.

»2లో

## ప్రభుత్వ అరాచకాలను మరింతగా ఎండగడతాం: కేటీఆర్

## పహల్గాం దాడి.. ప్రధాని మోదీతో రాజ్‌నాథ్ కీలక భేటీ



» 3లో

## పహల్గాం ఉగ్రదాడిపై కాంగ్రెస్ నేతలకు అధిష్టానం కీలక ఆదేశాలు

» 2లో



## తెలంగాణకు తీరని అన్యాయం చేసింది కేసీఆరే: ఉత్తమ్

కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్గొండ జిల్లా కంచుకోట అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

ఈ కబురు,నల్గొండ: కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్గొండ జిల్లా కంచుకోట అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. భవిష్యత్‌లోనూ కాంగ్రెస్‌ను సమర్థంగా నడిపించే నేతలు ఈ జిల్లాలో ఉన్నారని చెప్పారు.



తరువాయి 2లో

మొదటి పేజీ తరువాయి

## పద్మ భూషణ్ అవార్డు అందుకున్న బాలకృష్ణ



**తెలుగుదనం ఉట్టిపడేలా..**

తెలుగుదనం ఉట్టిపడేలా పంచె కట్టులో 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవానికి హాజరయ్యారు బాలకృష్ణ. ఢిల్లీలోని మాన్‌సింగ్ రోడ్డు నుంచి రాష్ట్రపతి భవన్‌కు కుటుంబంతో కలిసి ఆయన బయలుదేరిన దృశ్యాలు నెట్టింట వైరల్ అయ్యాయి.

నట సార్వభౌముడు నందమూరి తారకరామారావు తనయుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి.. తండ్రి అడుగు జాడల్లో ప్రయాణించి నటుడిగా ప్రశంసలు దక్కించుకున్నారు బాలకృష్ణ. గతేడాది 50 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. పౌరాణికం, జానపదం, సాంఘికం, సైన్స్ ఫిక్షన్, బయోపిక్.. ఇలా అన్ని జానర్లను టచ్ చేసిన ఏకైక అగ్ర నటుడిగా ఆయన తెలుగు ప్రేక్షకుల మది దోచుకున్నారు. క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్‌గా ఎంతో మందికి ఆపన్న హస్తం అందిస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఆయనకు 'పద్మభూషణ్'

**పద్మభూషణ్ అజిత్..**

కళలు విభాగంలో.. కోలీవుడ్ హీరో అజిత్ సైతం పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు. తాను పద్మ పురస్కారానికి ఎంపికైన సమయంలో అజిత్ భావోద్వేగానికి గురైన సంగతి తెలిసిందే. ''ఈ శుభవార్తను వినేందుకు నా తండ్రి జీవించి ఉంటే బాగుండుదనిపిస్తోంది. ఆయన గర్వపడేవారు'' అని పేర్కొన్నారు. సినీ రంగంలోనే కాకుండా అజిత్‌కు రేసింగ్‌లోనూ ప్రావీణ్యం ఉంది. ఈ ఏడాది ఇప్పటికే మూడు అంతర్జాయ పోటీల్లో ఆయన టీమ్ రికార్డులు సృష్టించింది.

**పద్మభూషణ్ శేఖర్ కపూర్**

'మిస్టర్ ఇండియా', 'బండిట్ క్వీన్' తదితర హిందీ చిత్రా దర్శకుడు శేఖర్ కపూర్.. పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు.

**మరణానంతరం..**

ప్రముఖ రచయిత, దర్శకుడు ఎం.టి. వాసుదేవన్ నాయర్‌కు పద్మ విభూషణ్, గాయకుడు పంకజ్ ఉదాస్‌లకు పద్మ భూషణ్ మరణానంతరం ప్రకటించారు.దీంతో, కుటుంబ సభ్యులు పురస్కారాలు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు, శివరాజ్‌సింగ్ చౌహాన్, జితేంద్రసింగ్‌తో పాటు ఏపీ మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి తదితరులు పాల్గొన్నారు. అన్ని రంగాల్లో కలిపి.. ఈ ఏడాది ఏడుగురికి పద్మవిభూషణ్, 19 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలను కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. వీరిలో నేడు దాదాపు సగం మందికి పురస్కారాలను ప్రదానం చేశారు. మిగతా వారికి త్వరలో ప్రదానం చేయనున్నారు. సినీ రంగానికి సంబంధించి నటి శోభన (పద్మభూషణ్) తదితరులు ఈ జాబితాలో ఉన్నారు.

## పహల్గాం ఉగ్రదాడిపై కాంగ్రెస్ నేతలకు అధిష్టానం కీలక ఆదేశాలు

ఈ కబురు: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తాజాగా కాంగ్రెస్ అధిష్టానం కీలక ఆదేశాలు జారీ చేసింది. పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా పార్టీ లైన్ దాటి ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని సోమవారం కాంగ్రెస్ నేతలకు అధిష్ఠానం ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. అయితే ఉగ్రదాడిపై కొంత మంది కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు వివాదస్పదంగా మారాయి, దీంతో కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సి రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. పహల్గాం అంశంపై భవిష్యత్తులో జరిగే ఏదైనా సమాచార మార్పిడి కాంగ్రెస్ ప్రకటించిన వైఖరికి కట్టుబడి ఉండాలని పార్టీ నాయకత్వం స్పష్టం చేసినట్లు తెలిసింది. ఉగ్రదాడిపై పలువురు కాంగ్రెస్ నాయకులు అడ్డదిడ్డంగా మాట్లాడటం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే , అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి వచ్చినట్లు పార్టీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. పాకిస్తాన్‌తో యుద్ధం అవసరం లేదని, బదులుగా భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే.

## మావోయిస్టు అగ్రనేత అభయ్ సంచలన లేఖ

ఈ కబురు: ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపేయాలని.. తమతో శాంతి చర్చలు జరపాలని మావోయిస్టులు ప్రకటించారు. సోమవారం సాయంత్రం మావోయిస్టు అగ్రనేత అభయ్ పేరుతో లేఖ విడుదల చేశారు. షరతులు లేకుండా చర్చలు జరుపాలని లేఖలో పేర్కొన్నారు. కాగా, తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కొన్నాళ్లుగా భద్రతా బలగాలు వరుస ఎన్‌కౌంటర్లకు దిగుతున్నారు. ఈ ఎదురుకాల్పుల్లో వందలాది మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. నిన్నా, మొన్నటి వరకు ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కాల్పులు జరుపగా, తాజాగా భూపాలపల్లి సరిహద్దు వరకూ జల్లెడ పడుతున్నారు. మరోవైపు కర్రిగుట్టల్లోనూ వేట కొనసాగిస్తున్నారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ కగార్‌ను స్పీడప్ చేశారు. ఈ వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టులతో శాంతి చర్చలు జరగాలనే డిమాండ్ తెరపైకి తెచ్చారు. దీనిపై పలు రాజకీయ పార్టీల నేతలు సైతం స్పందించి ఎన్‌కౌంటర్‌ను ఖండించారు. శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

## గ్రూప్-1 పిటిషనర్లకు తెలంగాణ హైకోర్టు జరిమానా

**తప్పుడు ప్రమాణ పత్రాలతో పిటిషన్ దాఖలు చేసిన గ్రూప్ -1 అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు రూ.20వేల జరిమానా విధించింది.**

ఈ కబురు:హైదరాబాద్: తప్పుడు ప్రమాణ పత్రాలతో పిటిషన్ దాఖలు చేసిన గ్రూప్ 1 అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు రూ.20వేల జరిమానా విధించింది. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్ 1 మెయిన్స్ మూల్యాంకనంలో అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ మొత్తం 19 మంది పిటిషన్ దాఖలు చేశారు. మెమోకు, వెబ్‌సైట్‌లోని మార్కులకు తేడాలున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. రీవాల్యుయేషన్ చేసి మార్కులు పారదర్శకంగా వెల్లడించాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్లు తప్పుడు ప్రమాణ పత్రాలు దాఖలు చేశారని టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. ప్రాథమిక వివరాలను పరిశీలించిన న్యాయస్థానం.. అభ్యర్థులు తప్పుడు అఫిడవిట్ ఇచ్చారని పేర్కొంది. వాస్తవాలను దాచిపెట్టి కోర్టును తప్పుదోవ పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషనర్లపై చర్యలు తీసుకోవాలని జ్యుడీషియల్ రిజిస్ట్రార్‌ను ఆదేశించింది.

## పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

ఈ కబురు : ఎప్పుడూ అధికారులతో మీటింగులు.. మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చలతో బిజీ బిజీగా ఉండే సీఎం రేవంత్ రెడ్డి సోమవారం మాత్రం.. అవన్నీ పక్కన పెట్టి ఓ సోలో పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. చిత్రకారుడు నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోలో పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్ లో కావూరి హిల్స్ చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన అనంతరం.. అక్కడ ఏర్పాటు చేసిన పెయింటింగ్‌స్‌ను పరిశీలించి, నరేందర్ రెడ్డిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని అందమైన



మొదటి పేజీ తరువాయి

# ఖజానా ఖాళీ చేసి మాపై నిందలా..? కేసీఆర్‌పై మండిపడ్డ సీఎం రేవంత్‌రెడ్డి

**జానారెడ్డితో సీఎం భేటీ..**

జానారెడ్డితో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. మావోయిస్టులతో చర్చల కోసం శాంతి కమిటీ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా సీఎం అన్నారు. మావోయిస్టుల అంశంపై జానారెడ్డి, కేకేశవరావు పార్టీలో చర్చిస్తారని తెలిపారు.

బీఆర్ఎస్ ను నమ్మే స్థితిలో ప్రజలు లేరని ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న అనర్థాలకు కేసీఆరే కారణం అని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ రాష్ట్ర ఖజానా అంతా ఖాళీ చేసి ఇప్పుడు మాపై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇవాళ జానారెడ్డి నివాసానికి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి అక్కడ జానారెడ్డి, కేకే, వేం నరేందర్ రెడ్డితో కలిసి నిన్న శాంతి కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలు, అపరేషన్ కగార్, శాంతి చర్చలు, కాల్పుల విరమణపై చర్చించారు. అనంతరం మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ముఖ్యమంత్రి.. నిన్న బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ వ్యాఖ్యలకు రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ అభద్రతా భావంలో అక్కసు వెల్లగక్కారని ఫైర్ అయ్యారు. ఆయన స్పీచ్ లో క్లారిటీ లేదన్నారు. కక్ష సాధింపు చర్యలకు నేను దగనని కేటీఆర్ పై కేసు అయినా.. ఫోన్ ట్యాపింగ్ కేసు అయినా.. అన్నీ చట్ట పరిధిలోనే జరుగుతాయని చెప్పారు. కేసీఆర్ లాగా నేను చట్టాన్ని అతిక్రమించి అరెస్టు చేయించనన్నారు. కేసీఆర్ సభకు ఎన్ని బస్సులు అడిగితే అన్ని ఇచ్చాం. గతంలో ఆర్టీసీ కూడా ఆదాయం వచ్చిందన్నారు. గతంలో బీఆర్ఎస్ హయంలో రాహుల్ గాంధీ సభకు బస్సులు ఇవ్వమంటే ఇవ్వకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అవసరాలకు అనుగుణంగా కేసీఆర్, మోడీ మాటలు మారుస్తున్నారని మండిపడ్డారు. దేశానికి ఇందిరాగాంధీ లాంటి ప్రధాని కావాలని, రెండు దేశాలను ఓడించిన ఘనత ఇందిరాగాంధీదేనన్నారు.

**మావోయిస్టులతో చర్చలకు శాంతి కమిటీ:**

మావోయిస్టులతో చర్చల కోసం శాంతి కమిటీ ఏర్పాటు చేస్తాని సీఎం చెప్పారు. మావోయిస్టుల అంశంపై జానారెడ్డి, కేకే పార్టీలో చర్చిస్తారు. గతంలో మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపింది ఈ ఇద్దర నేనని చెప్పారు. ఇప్పుడు కూడ ఆ వ్యవహారం అంతా జానారెడ్డి, కేకే చూస్తారని చెప్పారు. ఆపరేషన్ కగార్ పై జాతీయ స్థాయిలో చర్చ జరగాలని అధిష్టానానికి పీస్ కమిటీ ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. దీనిపై మా పార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రభుత్వ విధానం ప్రకటిస్తామన్నారు.

**ఎమ్మెల్యేలకు స్వీట్ వార్నింగ్:**

ఎమ్మెల్యేలు హైదరాబాద్ లో టైమ్ పాస్ చేయడం సరి కాదని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీలో ఓపిక ఉంటే పదవులు వస్తాయి. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే నష్టపోతారు. రాహుల్ గాంధీకి, నాకు గ్యాప్ ఉందనడం అవాస్తవం అని మా ఇద్దరి మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని ఎవర్నీ నమ్మించాల్సిన పని లేదన్నారు. బయట ఎవరు ఏమనుకున్నా నేను పట్టించుకోనని చెప్పారు.

''ఎల్కతుర్తి సభలో కేసీఆర్ మాటల్లో అభద్రత కనిపించింది. ఆయన ప్రసంగంలో పస లేదు. స్పష్టత లేదు. కాంగ్రెస్‌పై తన అక్కసునంతా వెళ్లగక్కారు. కేసీఆర్ ఏం చేసినా.. భారాసను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అసెంబ్లీలో భారాస తరఫున మాట్లాడుతున్నది పిల్లగాళ్లని ఆయనే చెప్పేశారు.

**భారాసను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు**

రాహుల్ గాంధీకి, నాకూ మధ్య అంతరం అవాస్తవం
కొందరు అధికారులు సంపాదన వైపే చూస్తున్నారు
మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్‌రెడ్డి

''ఎల్కతుర్తి సభలో కేసీఆర్ మాటల్లో అభద్రత కనిపించింది. ఆయన ప్రసంగంలో పస లేదు. స్పష్టత లేదు. కాంగ్రెస్‌పై తన అక్కసునంతా వెళ్లగక్కారు. కేసీఆర్ ఏం చేసినా.. భారాసను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అసెంబ్లీలో భారాస తరఫున మాట్లాడుతున్నది పిల్లగాళ్లని ఆయనే చెప్పేశారు. మరి వారినెందుకు అసెంబ్లీకి పంపిస్తున్నారు'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డి ఇంటి వద్ద సోమవారం సీఎం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ''ఆపరేషన్ కగార్‌పై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జరిపిన చర్చల మేరకు.. ఈరోజు జానారెడ్డి, కేకేలతో చర్చించాం. ఈ అంశంపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలి. మా పార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాత.. ప్రభుత్వ విధానం ప్రకటిస్తాం. రాహుల్ గాంధీకి, నాకు మధ్య అంతరం(గ్యాప్) ఉందనడం అవాస్తవం. మా మధ్య మంచి సంబంధాలున్నాయి. మా ఇద్దరికీ ఉన్న సంబంధాన్ని బయట ప్రపంచానికి చెప్పాల్సిన అవసరం లేదు. ఎవర్నీ నమ్మించాల్సిన అవసరం అస్సల్లేదు. కేసీఆర్, మోదీ వాళ్ల అవసరాలకు అనుగుణంగా మాటలు మారుస్తున్నారు. దేశానికి ఇందిరా గాంధీ లాంటి ప్రధాని కావాలి. ప్రపంచంలో ఆమెను మించిన యోధురాలు లేరు. ఒక దేశాన్ని ఓడించిన ఘనత ఇందిరా గాంధీదే.

పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ మా ప్రభుత్వ పాలనపై ఇప్పటినుంచే చర్చ ఎందుకుంటుంది? ఎన్నికలకు ముందు చివరి ఆరు నెలలూ చర్చ జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలు.. దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమల్లో లేవు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక కొత్త పథకాలు తీసుకొచ్చాం. తొలి ఏడాదిన్నర ప్రణాళికల రూపకల్పనకే సమయం పోయింది. ఇప్పుడు వాటిని సమీక్షిస్తున్నాం. పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం.

**ఓపికగా ఉంటే పదవులు వస్తాయి**

మరో 20 ఏళ్లు నేను రాజకీయాల్లో ఉంటా. గత ప్రభుత్వంలో తప్పు చేసినవారిని అరెస్టు చేయాలని డిమాండ్ వస్తోంది. కానీ, నేను అలా అరెస్టు చేయలేను. అన్నీ చట్ట ప్రకారమే జరుగుతాయి. నేను కేసీఆర్ లాగా చట్టాన్ని అతిక్రమించను. చట్టప్రకారమే నడుచుకుంటా. నేను ఒక మాట ఇచ్చానంటే.. అంతే అంకితభావంతో పని చేస్తా. ఇచ్చిన మాటను అమలుచేసి తీరుతా. అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పా. ఇప్పించాను. నన్ను నమ్ముకున్న వాళ్లను మోసం చేయను. రేవంత్ చెప్పింది చేస్తాడనే నమ్మకం ప్రజలకు కలిగేలా చేస్తా. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయి. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే నష్టపోతారు.

**కొందరు ఎమ్మెల్యేలు టైమ్‌పాస్ చేస్తున్నారు**

చేసిన పనుల గురించి చెప్పుకోవడంలో కొంత వెనుకబడ్డాం. దీన్ని మరింత వేగవంతం చేయాల్సిన అవసరముంది. ఎమ్మెల్యేలను నియోజకవర్గాల్లో పర్యటించాలని చెబితే... కొందరు హైదరాబాద్‌లోనే టైమ్‌పాస్ చేస్తున్నారు. ఎమ్మెల్యే అయ్యాక.. మనోడు, మందోడు అని ఉండదు. ఎమ్మెల్యేలందరూ కచ్చితంగా ప్రజల్లోకి వెళ్లాల్సిందే. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అలా వెళ్తేనే పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరతాయి. అధికారుల విషయంలో ప్రభుత్వం కొంత సంయమనం పాటించాల్సిన అవసరముంది. అందరూ మనవాళ్లు ఉండరు. ఉన్నవాళ్లను మన వాళ్లుగా మార్చుకోవాలి. భూభారతి, ధరణి అంశాలపై నవీన్ మిత్తల్‌కు పూర్తి అవగాహన ఉంది. అలాంటి వారిని మార్చలేం. కొంతమంది అధికారులు సర్వీస్ చేయమంటే.. సంపాదన మార్గంలో ఉన్నారు. అలాంటివారిని కాకుండా.. సబ్జెక్ట్, కమిట్‌మెంట్ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తున్నాం. కొందరు అధికారుల గురించి నాకు తెలుసు. కానీ మరో ఆప్షన్ లేక వారిని కొనసాగించాల్సి వస్తోంది. ఉన్నపళంగా తొలగిస్తే.. పాత విషయాలన్నీ తెలిసేదెలా?'' అని ముఖ్యమంత్రి అన్నారు.

# పార్టీ నిర్ణయం తర్వాతే.. ప్రభుత్వం విధానం: ఆపరేషన్ కగార్‌పై సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి



ఆదివారం (ఏప్రిల్ 27) శాంతి చర్చల కమిటీతో సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. కాల్పుల విరమణకు కేంద్రాన్ని ఒప్పించాలని శాంతి చర్చల కమిటీతో సీఎంను కోరింది. ఈ అంశాన్ని కూడా సీఎం రేవంత్ జానా రెడ్డితో డిస్కస్ చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్‌పై మా పార్టీ నిర్ణయం తీసుకున్నాక.. ప్రభుత్వ విధానం ప్రకటిస్తామని స్పష్టం చేశారు. కగార్ అంశంపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలన్నారు. మావోయిస్టులతో చర్చల కోసం శాంతి కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. మావోయిస్టుల అంశంపై జానా రెడ్డి, కేకే పార్టీ చర్చిస్తారని పేర్కొన్నారు. కాగా, 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని అంతం చేయాలని కంకణం కట్టుకున్న కేంద్ర ప్రభుత్వం.. ఇందు కోసం ఆపరేషన్ కగార్ చేపట్టింది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ కగార్ ముమ్మరంగా సాగుతోంది. ఈ క్రమంలోనే తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో మావోయిస్టు పార్టీ కీలక నేత హిడ్మాతో పాటు మరో వెయ్యి మందికి పైగా నక్సలైట్లు ఉన్నట్లు భద్రతా దళాలకు నిఘావర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో కర్రెగుట్టల్లో ఐదు రోజుల నుంచి కేంద్ర, రాష్ట్ర బలగాలు కూంబింగ్ చేపట్టాయి. తెలంగాణఛత్తీస్‌గఢ్‌మహారాష్ట్ర మూడు వైపుల నుంచి కర్రెగుట్టలను భద్రతా దళాలు చుట్టుముట్టాయి. హిడ్మాతో పాటు మరికొందరు కీలక నేతలే లక్ష్యంగా భద్రతా దళాలు ముందుకు సాగుతున్నాయి. ఈ క్రమంలో భద్రతా దళాలు, మవోయిస్టుల మధ్య భీకర ఎదురు కాల్పులతో కర్రెగుట్టలు తుటాల మోతతో దద్దరిల్లుతున్నాయి. ఈ క్రమంలో కర్రెగుట్టల్లో కేంద్ర, రాష్ట్ర బలగాలు చేపట్టిన ఆపరేషన్ కగార్ వెంటనే ఆపేయాలని మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేసింది. శాంతి చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని.. నెలరోజుల పాటు ఆపరేషన్ కగార్ ఆపాలని విజ్ఞప్తి చేసింది. మావోయిస్టు పార్టీ అభ్యర్థనను ఏ మాత్రం లెక్కచేయని భద్రత దళాలు నక్సలైట్ల ఏరివేత లక్ష్యంగా కర్రెగుట్టల్లో ముందుకు వెళ్తున్నాయి. దీంతో శాంతి చర్చల కమిటీ సీఎం రేవంత్ రెడ్డిని కలిసి .. కాల్పుల విరమణకు ప్రభుత్వాన్ని ఒప్పించాలని రిక్వెస్ట్ చేశాయి.

## తెలంగాణకు తీరని అన్యాయం చేసింది కేసీఆరే: ఉత్తమ్



నల్గొండ కలెక్టరేట్‌లో అదనపు బ్లాక్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నల్గొండ పట్టణాన్ని మంత్రి కోమటిరెడ్డి అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని కితాబిచ్చారు.

''గత భారాస ప్రభుత్వం నల్గొండ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. డిండి, ఏదుల ప్రాజెక్టులను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను పదేళ్లపాటు కేసీఆర్ పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం మళ్లీ పని ప్రారంభించిన కొన్ని రోజులకే దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగింది. ఇప్పటికైనా ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి తీరుతాం. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు నల్గొండ జిల్లా నాయకులం ముక్తకంఠంతో మద్దతు తెలుపుతున్నాం. ప్రాజెక్టులకు భూసేకరణ విషయంలో ప్రజలు సహకరించాలి. రైతులను ఒప్పించిన తర్వాతే ప్రాజెక్టులకు భూసేకరణ చేస్తాం. డిండి ఎత్తిపోతల పథకాన్ని సంస్థాన్‌నారాయణపురం, చౌటుప్పల్ వరకు పొడిగిస్తాం. పూడిక వల్ల ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం తగ్గింది. ఎస్ఆర్ఎస్పీ ఫేజ్ 2 పనులను పూర్తి చేస్తే.. ఉమ్మడి నల్గొండ జిల్లాకు నీటి సమస్య తీరుతుంది. సాగునీటి రంగంలో రూ.1.81 లక్షల ఖర్చు చేసి, భారాస నేతలు జేబులు నింపుకొన్నారు. భారాస నేతల కమీషన్ల కక్కుర్తి వల్లే, రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేసిన కాళేశ్వరం నాణ్యత లోపించి మూడేళ్లలోనే కూలిపోయింది. రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి.. అప్పులు చేసి కాళేశ్వరం పేరిట రూ. లక్ష కోట్లు ఖర్చు చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు పనికిరావని ఎన్‌డీఎస్ఏ చెప్పింది. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని ఒప్పుకొని రాష్ట్రానికి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారు. కానీ, తెలంగాణకే 500 టీఎంసీలు కేటాయించాలని ఈ ప్రభుత్వం పోరాడుతోంది'' అని ఉత్తమ్ అన్నారు.

**కేసీఆర్.. సోనియా ఆశీస్సులు తీసుకోలేదా?: కోమటిరెడ్డి**

'తెలంగాణ ఇచ్చిన దేవత సోనియాగాంధీ అని కేసీఆర్ అనలేదా?' అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. ఇప్పుడు ఆయనే.. తెలంగాణ విలన్ కాంగ్రెస్ పార్టీ అని దారుణంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ''తెలంగాణ ఇచ్చినప్పుడు కుటుంబ సమేతంగా వెళ్లి సోనియాగాంధీ ఆశీస్సులు తీసుకోలేదా? హైదరాబాద్‌తో కూడిన తెలంగాణను సోనియాగాంధీ ఇచ్చారని అసెంబ్లీలో కేసీఆర్ అనలేదా? ఇచ్చిన ప్రతి హామీని ఈ ప్రభుత్వం క్రమక్రమంగా నెరవేరుస్తోంది. కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి రూ.10వేల కోట్లు దోచుకుతిన్నారు. ధరణి పోర్టల్ తీసుకొచ్చి వేల ఎకరాలు ఆక్రమించుకున్నారు. మంత్రులు, అధికారుల ఫోన్లు ట్యాపింగ్ చేయించి.. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. పదేళ్లు పాలించిన కేసీఆర్.. ఉద్యోగులకు సరిగా జీతాలు కూడా ఇవ్వలేదు'' అని విమర్శించారు.

మొదటి పేజీ తరువాయి

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన కాబోయే సీఎస్ రామకృష్ణారావు



మొదటి పేజీ తరువాయి

## రాజ్‌భవన్‌లో లోకాయుక్త, ఉపలోకాయుక్త ప్రమాణస్వీకారం

మొదటి పేజీ తరువాయి



ఈ కబురు,హైదరాబాద్: రాజ్‌భవన్‌లో తెలంగాణ లోకాయుక్త, ఉప లోకాయుక్త ప్రమాణస్వీకారం చేశారు. లోకాయుక్తగా జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, ఉప లోకాయుక్తగా బీఎస్ జగ్జీవన్ కుమార్‌తో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, షబ్బీర్ అలీ, వేం నరేందర్‌రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## జిమ్‌లో వర్కౌట్ చేస్తుండగా కేటీఆర్‌కు గాయం



మొదటి పేజీ తరువాయి

ఈ కబురు,హైదరాబాద్: జిమ్‌లో వర్కౌట్ చేస్తుండగా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ గాయపడ్డారు. కొన్ని రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు ఆయనకు సూచించారు. ఈ విషయాన్ని కేటీఆర్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. వైద్యుల పర్యవేక్షణలో రికవరీ అవుతున్నట్లు పేర్కొన్నారు. త్వరగా కోలుకొని రోజువారీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న పలువురు భారాస నేతలు, అభిమానులు కేటీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పోస్టులు పెడుతున్నారు.

త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా: పవన్ ట్వీట్
కేటీఆర్ త్వరగా కోలుకోవాలని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన కార్యాలయం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. ''సోదరుడు, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ జిమ్‌లో వ్యాయామం చేస్తూ గాయపడ్డారని తెలిసింది. వైద్యుల సూచనలకు అనుగుణంగా తగిన విశ్రాంతి తీసుకోవాలి. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా'' అని పవన్ పేర్కొన్నారు.

## ప్రభుత్వ అరాచకాలను మరింతగా ఎండగడతాం: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

**తెలంగాణలో తిరిగి అధికారంలోకి వచ్చేది భారాసనేనని, సభకు లక్షలాదిగా వచ్చిన ప్రజలు చెప్పిన సందేశం ఇదేనని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.**

ఈ కబురు,హైదరాబాద్: తెలంగాణలో తిరిగి అధికారంలోకి వచ్చేది భారాసనేనని, రజతోత్సవ సభకు లక్షలాదిగా వచ్చిన ప్రజలు చెప్పిన సందేశం ఇదేనని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఎల్కతుర్తిలో ఆదివారం జరిగిన భారాస రజతోత్సవ సభపై భారాస నాయకులు, కార్యకర్తలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

''భారాస రజతోత్సవ సభ విజయవంతం చేసిన తెలంగాణకు ధన్యవాదాలు. దేశ రాజకీయ చరిత్రలో అతి పెద్ద సభల్లో ఒకటిగా నిలిచిపోతుంది. నిన్నటి సమావేశం రజతోత్సవ కార్యక్రమాలకు ప్రారంభం మాత్రమే. ఇకపై తానే ముందుండి పోరాడతానని కేసీఆర్ ప్రకటించారు. భవిష్యత్తులో మరిన్ని ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి. రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సమయం ఇచ్చాం. ఇకపై ప్రతి అంశంపై ప్రభుత్వాన్ని వెంటాడుతాం. ప్రభుత్వ అరాచకాలను మరింతగా ఎండగడతాం''అని కేటీఆర్ అన్నారు.

## పహల్గాం దాడి.. ప్రధాని మోదీతో

# రాజ్‌నాథ్ కీలక భేటీ

**ప్రధాని మోదీతో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయ్యారు. పహల్గాంలో భద్రతా చర్యలను వివరించారు.**

**ఈ కబురు:**

పహల్గాం దాడితో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాదికి గుణపాఠం చెప్పేందుకు న్యూదిల్లీ సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. పహల్గాంలో పరిస్థితులతో పాటు భద్రతా సన్నద్ధతపై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించారు. దాదాపు 40 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది.

పహల్గాం దాడి నేపథ్యంలో భారత్ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహన్‌తో రాజ్‌నాథ్ ఆదివారం భేటీ అయ్యారు. ఆ సమావేశంలో మన సైన్యం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను రక్షణమంత్రి నేడు ప్రధానికి వివరించారు. మోదీతో భేటీలో



జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ఢోబాల్ కూడా పాల్గొన్నారు.

**మధ్యాహ్నం మరో కీలక భేటీ..**

మరోవైపు, రక్షణ వ్యవహారాలపై పార్లమెంట్



స్టాండింగ్ కమిటీ కూడా సోమవారం భేటీ అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. పార్లమెంట్ హౌస్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ఈ భేటీ జరగనున్నట్లు అధికారిక వర్గాల సమాచారం.

**పాక్‌కు తుర్కియే సైనిక విమానాలు..**

**ఇదిలాఉండగా.. పహల్గాం దాడితో సరిహద్దుల్లో అలజడి వాతావరణం నెలకొంది. భారత్ వైపు నుంచి దాడి ఉండొచ్చన్న అంచనాలతో పాక్ ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే సరిహద్దుల్లో అదనపు బలగాలను మోహరించినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా తుర్కియేకు చెందిన పలు సీ-130 హెర్క్యులస్ విమానాలు పాక్‌లో ల్యాండ్ అయ్యాయి. ఈ విమానాల్లో సైన్యానికి అవసరమైన కార్గోను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.**

---

## ఇక అలలపై 'రఫేల్ ఎం' గర్జనలు..

# నౌకాదళానికి అత్యాధునిక ఫైటర్ జెట్‌లు

**భారత సముద్ర జలాలపై రఫేల్ గర్జనలు వినిపించనున్నాయి. నౌకాదళం కోసం వీటిల్లోని ప్రత్యేక రకాన్ని కొనుగోలు చేసేందుకు మన దేశం ఫ్రాన్స్‌తో ఒప్పందం కుదుర్చుకొంది.**

**ఈ కబురు:**

భారత నౌకాదళం చేతికి అత్యాధునిక యుద్ధ విమానాలు అందనున్నాయి. 26 రఫేల్ ఎం (మెరైన్) శ్రేణి విమానాలు కొనుగోలు చేసేందుకు వీలుగా భారత్ సోమవారం ఫ్రాన్స్‌తో ఒప్పందం కుదుర్చుకొంది. ఈ మేరకు సంతకాలు జరిగాయి. డీల్ విలువ రూ.63 వేల కోట్లు. ఇది పూర్తిగా ప్రభుత్వం నుంచి ప్రభుత్వం మధ్య జరిగిన ఒప్పందం. వీటిల్లో 22 సింగిల్ సీటర్ జెట్లు కాగా.. నాలుగు ట్విన్ సీటర్ ట్రైనర్లు. ఈ మొత్తం డెలివరీలు 2031 నాటికి పూర్తవుతాయని అంచనా.

ప్రపంచంలో నౌకాదళాలు వినియోగించే అత్యాధునిక ఫైటర్ జట్లలో ఒకటిగా రఫేల్ ఎంను పరిగణిస్తారు. దీనిలో శాఫ్రన్ గ్రూప్ తయారు చేసిన ప్రత్యేకమైన రీఎన్‌ఫోర్సడ్ ల్యాండింగ్ గేర్స్ వాడారు. ఇది విమానవాహక నౌకలపై దిగడానికి చాలా ఉపయోగపడుతుంది. ఈ విమానాల రెక్కలను మడతపెట్టే సౌకర్యం కూడా ఉంది.



ఈ విమానాలు ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్యపై భారత్ మోహరించనుంది. ప్రస్తుతం వాడుతున్న మిగ్ 29ల స్థానాలను ఇవి భర్తీ చేయనున్నాయి.

ప్రస్తుతం భారత వాయుసేన మొత్తం 36 రఫేల్ యుద్ధ విమానాలను వినియోగిస్తోంది. తాజాగా నేవీ కూడా వీటిని కొనుగోలు చేయనుండటంతో రెండు దళాల మధ్య సమన్వయం పెరుగుతుంది. బడ్డీబడ్డీ రీఫ్యూయలింగ్‌కు అవకాశం ఉంటుంది.

ఓ ఫైటర్ జెట్ రీఫ్యూయలింగ్ పాడ్ సాయంతో మరో ఫైటర్ జెట్‌లో ఇంధనం నింపడాన్ని ఇలా అంటారు. అప్పుడు భారీ ఫ్యూయల్ ట్యాంకర్ విమానాల అవసరం ఉండదు.

---

# పాక్ గుండెల్లో గుబులు..

## ఉగ్రవాదులను తరలిస్తున్న దాయాది సైన్యం?

**పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పాకిస్థాన్ సైన్యం ఖాళీ చేయిస్తున్నట్లు నిఘావర్గాల సమాచారం.**

**ఈ కబురు:**

పహల్గాం ఉగ్రదాడితో భారత్ పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి . భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పాకిస్థాన్ సైన్యం ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలించడం ప్రారంభించింది. ఈ మేరకు నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనం ప్రచురితమైంది.

భారత భద్రతా సంస్థలు క్రియాశీలకంగా ఉన్న పలు లాంచ్‌ప్యాడ్‌లను గుర్తించిన నేపథ్యంలో పాక్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పీఓకేలోని కెల్, సర్ది, దుధ్నియల్, అత్ముఖం, జురా, లిపా, పచ్చిబన్, ఫార్వర్డ్ కహుతా, కొట్లి వంటి పలు ప్రాంతాల నుంచి ఉగ్రవాదులను తరలిస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం. ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లోకి చొరబడటానికి ముందు వారు నివసించే కీలక కేంద్రాలుగా ఈ లాంచ్‌ప్యాడ్స్ పనిచేస్తాయి. వీటిలో 150 నుంచి 200 మంది



శిక్షణ పొందిన ఉగ్రవాదులు ఉన్నారని, వారంతా చొరబాటుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నాయి.

**పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో భారత్, పాక్‌ల ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది అక్కసు వెళ్లగక్కింది. సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని నిలిపేస్తున్నట్లు వెల్లడించింది.**



25 years ఇంటర్మీడియట్ batch, ఆత్మీయ సమ్మేళనం

## పూర్వ విద్యార్థుల అపూర్వ వేడుక

**ఖమ్మం పట్టణం పట్టణంలోని గాయత్రి ఫంక్షన్ హాల్ లో 1999 2000 బ్యాచ్ 25 ఏళ్ల రజితోత్సవ వేడుకల సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒక చోట చేరుకొని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.**

**ఈ కబురు,ఖమ్మం:**

1999 2000 బ్యాచ్ ఇంటర్మీడియట్ కళాశాలలో చదివిన విద్యార్థులందరూ ఒకచోట చేరి ఒకరినొకరు పలకరించుకుంటూ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఒకరికొకరు బాగోగులు తెలుసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనంద పరవశంలో మునిగిపోయారు. బ్యాచ్లో ఉద్యోగాల్లో స్థిరపడిన వారు కొందరైతే మరికొందరు వివిధ వృత్తుల్లో, వ్యాపారాల్లో స్థిరపడినట్లు ఒకరికొకరు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పి ఇంతటి స్థాయికి వచ్చేందుకు కృషిచేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. గురుదేవో మహేశ్వర అంటూ వారికి నమస్కారాలు తెలియజేస్తూ మరొకసారి తమ గురువుల ఆశీస్సులు తీసుకొని పరవశించిపోయారు. గురువులు మాట్లాడుతూ తాము బోధించిన పాఠ్యాంశాలను జీవితానికి సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగి మంచి మంచి స్థానాల్లో స్థిరపడినటువంటి పూర్వ విద్యార్థులను చూసి ఎంతో గర్వపడుతున్నట్లు పలువురు ఉపాధ్యాయులు ఈ సందర్భంగా ఆనందాన్ని వ్యక్తం చేశారు.



## క్రిమియాపై జెలెన్‌స్కీ దారికొస్తాడు: ట్రంప్

**రష్యా స్వాధీనంలోని క్రిమియా ఆ దేశానికే చెందుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి స్పష్టంచేశారు.**

**ఈ కబురు:**

ఉక్రెయిన్‌రష్యా యుద్ధానికి ముగింపు పలకాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆకాంక్షిస్తున్నారు. ఈ చర్చల నేపథ్యంలో రష్యా స్వాధీనంలో ఉన్న క్రిమియా అంశంపై ఇటీవల తీవ్రస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. ఈ ద్వీపంపై ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. శాంతి ఒప్పందంలో భాగంగా క్రిమియాను రష్యాకు ఇచ్చేందుకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియల నేపథ్యంలో జెలెన్‌స్కీ, ట్రంప్‌లు భేటీ అయిన సంగతి తెలిసిందే. ఈ భేటీపై ట్రంప్ మాట్లాడుతూ.. సమావేశం సానుకూలంగా జరిగిందన్నారు. క్రిమియా అంశాన్ని చాలా క్లుప్తంగా చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రిమియా ను ఉక్రెయిన్ వదులుకుంటుందని మీరు అనుకుంటున్నారా అని ఒక విలేకరి ప్రశ్నించారు. దీనికి ట్రంప్ బదులిస్తూ.. అది జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కీవ్‌పై మాస్కో దాడులు చేయడం తనను నిరాశకు గురిచేస్తోందన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ దాడులు చేయడం ఆపేసి శాంతి ఒప్పందంపై సంతకం చేసి, వివాదాన్ని ముగించాలని పిలుపునిచ్చారు. ట్రంప్ తాజా వ్యాఖ్యలపై జెలెన్‌స్కీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ దీనిపై స్పందిస్తూ.. తమ దేశం గురించి ట్రంప్ సరిగ్గా అర్థం చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు.

**క్రిమియాపై రష్యా అధికారాన్ని అంగీకరించం**

కాగా.. ట్రంప్ మాటలకు విరుద్ధంగా క్రిమియాపై రష్యా అధికారాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని ఉక్రెయిన్ ఒక ప్రకటనలో పేర్కొంది. మాస్కో ఆక్రమించిన భూభాగాన్ని అప్పగించడం రాజకీయంగానే కాదు, చట్టపరంగానూ సాధ్యం కాదని కీవ్ తెలిపింది. ఇలా చేయాలంటే రాజ్యాంగంలో మార్పు చేయాలని, దేశవ్యాప్త ఓటింగ్ నిర్వహించాల్సి ఉంటుందని ఆ దేశ నిపుణులు చెబుతున్నారు.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో క్రిమియా అంశాన్ని ప్రస్తావించిన ట్రంప్.. అది రష్యాతోనే ఉంటుందని స్పష్టంచేశారు. అక్కడ ఎక్కువగా రష్యన్ భాష మాట్లాడతారని, ఎంతోకాలంగా సబ్‌మెరైన్లను రష్యా అక్కడ మోహరించిందన్నారు. ఇదంతా ట్రంప్ కాలంలోనే కాదని.. ఒబామా హయాంలోనూ జరిగిందన్నారు. ఆ ప్రాంతం రష్యాతో ఉన్న విషయాన్ని జెలెన్‌స్కీతో సహా ప్రతిఒక్కరూ అర్థం చేసుకుంటారన్నారు. దక్షిణ ఉక్రెయిన్‌లో నల్ల సముద్రం వెంబడి ఉన్న క్రిమియా .. వ్యూహాత్మక ప్రాంతం. 2014లో రష్యా దానిని స్వాధీనం చేసుకుంది.

## కాళేశ్వరంపై ముందుకెలా?

**హైదరాబాద్:** కాళేశ్వరం బ్యారేజీలపై విజిలెన్స్, ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికలపై ఎలా ముందుకెళ్లాలన్న దానిపై ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. విజిలెన్స్ నివేదిక ప్రకారం ఇంజినీర్లు, నిర్మాణ సంస్థపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు మరిన్ని పరీక్షలు చేయించి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలి. నిర్మాణ స్థలం ఖరారు, డిజైన్లు, నిర్మాణం, నాణ్యత తనిఖీ, నిర్వహణ... ఇలా అనేక అంశాల్లో లోపాలుండటంతో వాటన్నింటిని సవరించడంతో పాటు మేడిగడ్డలో ఏడో బ్లాకును పూర్తిగా తొలగించి మళ్లీ నిర్మించాలి. ఇవన్నీ ఎలా చేయాలి, ఏ పని ఎవరికి అప్పగించాలి, ఎప్పటి నుంచి ప్రారంభించాలనే దానిపై ఓ నిర్ణయానికి రావాల్సి ఉన్న నేపథ్యంలో ఈ నెల 30న సీఎం వద్ద ఉన్నతస్థాయి సమావేశం జరగనున్నట్లు తెలిసింది. మరోవైపు, మంగళవారం(29న) మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎన్డీఎస్ఏ నివేదికలోని ముఖ్యాంశాలపై మీడియాకు ప్రజంటేషన్ ఇవ్వనున్నారు.

మేడిగడ్డ బ్యారేజీ విషయంలో అంశాల వారీగా ఎక్కడెక్కడ లోపాలు జరిగాయి, నిర్మాణ సంస్థకు ఇంజినీర్లు ఎలా సహకరించారు, ఖజానాకు వాటిల్లిన నష్టంపై సమగ్ర నివేదిక ఇవ్వడంతోపాటు బాధ్యులైన ఇంజినీర్లపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు చేసింది. 17 మందిపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేపట్టాలని, మిగిలినవారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. నిర్మాణ సంస్థ 'ఎల్ అండ్ టీ'పైనా క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేపట్టడంతోపాటు మేడిగడ్డ ఏడో బ్లాకు పునరుద్ధరణకు అయ్యే వ్యయాన్ని రికవరీ చేయాలని సిఫార్సు చేసింది. నివేదిక వచ్చి నెల దాటినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. దీనిపై సీఎం వద్ద జరిగే సమావేశంలో చర్చించే అవకాశముందని నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. మరోవైపు మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా సురక్షితం కాదని ఎన్డీఎస్ఏ తన నివేదికలో పేర్కొంది. భవిష్యత్తులో ఈ బ్యారేజీలకు ఎదురయ్యే సవాళ్లనూ వివరించింది. ఈ సిఫార్సుల అమలు ప్రభుత్వానికి సవాలుగా మారనుంది. దీనిపై సీఎం నీటిపారుదల శాఖ అధికారులతో చర్చించి మంత్రివర్గం అభిప్రాయం కోరే అవకాశం ఉంది. మూడు బ్యారేజీల డిజైన్లను పునఃపరిశీలించడంతోపాటు జియో టెక్నికల్, హైడ్రలాజికల్, హైడ్రాలిక్, స్ట్రక్చరల్ అంశాల్లో లోపాలను గుర్తించాలని, బ్యారేజీల భద్రత, పటిష్ఠతను పరిగణనలోకి తీసుకోవాలని ఎన్డీఎస్ఏ తుది నివేదికలో పేర్కొంది. మళ్లీ పలు పరీక్షలు చేయాలనీ సూచించింది. ఈ నివేదికపై కార్యాచరణతో ముందుకెళ్తే తప్ప బ్యారేజీలను వినియోగంలోకి తేవడం సాధ్యం కాదనే అభిప్రాయం

## మార్కెట్లోకి సరికొత్త హైటెక్ ఫ్యాన్: ధర ఎంతంటే?

**అసలే ఎండాకాలం.. భానుడి భగభగలు కారణంగా రోడ్డు మీదనే కాదు, ఇంట్లో ఉండటం కూడా కష్టతరమైపోయింది. డబ్బున్నవాళ్ళు ఏసీలు, కూలర్లు వంటివి కొనేస్తుంటారు. పేదవాళ్ళు ఫ్యాన్లకు మాత్రమే పరిమితమవుతారు. ఇప్పటికే మార్కెట్లో లెక్కకు మించిన ఫ్యాన్లు వివిధ ధరలలో అందుబాటులోకి వచ్చేసాయి. కాగా గోల్డ్‌మెడల్ ఎలక్ట్రికల్స్ కంపెనీ ఓ సరికొత్త ఫ్యాన్‌ను పరిచయం చేసింది. దీని గురించి వివరంగా ఇక్కడ తెలుసుకుందాం.**



భారతదేశంలోని ప్రముఖ ఫాస్ట్ మూవింగ్ ఎలక్ట్రికల్ గూడ్స్ కంపెనీలలో ఒకటైన గోల్డ్‌మెడల్ ఎలక్ట్రికల్స్ 'విస్టా 3600 పెడెస్టల్ ఫ్యాన్'ను పరిచయం చేసింది. 360 డిగ్రీలు కదిలే ఈ ఫ్యాన్ మంచి కూలింగ్ అనుభవాన్ని అందిస్తుంది. ఇది హైగ్రేడ్ ప్లాస్టిక్ చేత నిర్మితమై ఉంది.

విస్టా 3600 పెడెస్టల్ ఫ్యాన్.. మూడు స్పీడ్ సెట్టింగ్‌లతో పాటు, నార్మల్, బ్రీజ్, నైట్ వంటి మల్టిపుల్ ఆపరేటింగ్ మోడ్‌లను పొందుతుంది. ఇన్‌ఫ్రారెడ్ రిమోట్ సౌలభ్యంతో.. అడ్జస్టబుల్ సెట్టింగ్‌లు సులభంగా ఉంటాయి. అంతే కాకుండా స్మార్ట్ ఎల్ఈడీ డిస్‌ప్లే ఫ్యాన్ చాలా ఆకర్షణీయంగా ఉంటుంది.

ఎక్కువ రోజులు ఇది పనిచేసేలా ఉండటానికి కంపెనీ హైగ్రేడ్ కాపర్ మోటార్‌ను ఇందులో ఫిక్స్ చేసింది. ఎనిమిది గంటల వ్యవధిలో ఈ ఫ్యాన్ స్విచ్ ఆఫ్ అయ్యేలా సెట్ చేసుకోవడానికి ఒక టైమర్ కూడా ఇందులో ఉంటుంది. విస్టా 3600 పెడెస్టల్ ఫ్యాన్ ధర అమెజాన్‌లో రూ. 11,427. కెంపెనీ దీనిపై రెండు సంవత్సరాల వారంటీని అందిస్తుంది.



## సొంతంగా స్టార్టప్.. కుమార్తెపై బిల్‌గేట్స్ ప్రశంసల వర్షం

**తల్లిదండ్రులు ఎంత సంపాదించినా.. వారి ఆస్తి నుంచి చిల్లిగవ్వ తీసుకోకుండా ఎదిగేవాళ్ళు చాలా తక్కువమందే ఉంటారు. ఇలాంటి కోవకు చెందిన వారిలో ఒకరు.. బిల్‌గేట్స్ కుమార్తె 'ఫోబ్ గేట్స్' . ఈమె తండ్రిపై ఆధారపడకుండానే.. సొంతంగా స్టార్టప్ కోసం నిధులను సమకూర్చుకుంది. ఇది తనకు చాలా సంతోషంగా ఉందని టెక్ బిలియనీర్ న్యూయార్క్ టైమ్స్ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.**

తన కుమార్తె ఫోబ్ గేట్స్.. తన స్టార్టప్ కోసం నిధులను సేకరించే క్రమంలో, తన దగ్గరకు వస్తుందని నేను ఊహించాను. ఒకవేళ తను నన్ను సహాయం చేయమని అడిగి ఉంటే.. తప్పకుండా చేసేవాణ్ణి. అయితే కొన్ని షరతులు కూడా పెట్టేవాడినని బిల్‌గేట్స్ అన్నారు. అయితే నిధుల కోసం నన్ను సంప్రదించకుండా.. సొంతంగా సమకూర్చుకున్న కూతురిపై ఆయన ప్రశంసల వర్షం కురిపించారు.

22 ఏళ్ల ఫోబ్ గేట్స్.. తన స్నేహితురాలు సోఫియా కియానీతో కలిసి 'ఫియా' అనే స్టార్టప్ ప్రారంభించారు. ఇది ఒక సిజిటల్ ఫ్యాషన్ ప్లాట్‌ఫామ్. ఇందులో సుమారు 40,000 కంటే ఎక్కువ వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్న దుస్తుల ధరలను వెల్లడిస్తుంది. వినియోగదారులకు ఫ్యాషన్ ఉత్పత్తుల మీద బెస్ట్ డీల్స్ అందించడంతో పాటు.. ఆన్‌లైన్ షాపింగ్ అనుభవాన్ని మరింత మెరుగుపరచడమే దీని ప్రధాన లక్ష్యం.

2024లో స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన.. ఫోబ్ గేట్స్ తన స్టార్టప్ కోసం వెంచర్ క్యాపిటలిస్టులు & ఏంజెల్ ఇన్వెస్టర్ల నుంచి సుమారు 500000 డాలర్ల కంటే ఎక్కువ నిధులను సేకరించింది. సుమారు 102.2 బిలియన్ డాలర్ల సంపద కలిగిన తన తండ్రి బిల్‌గేట్స్ సహాయం పొందకుండా.. స్టార్టప్ ప్రారభించడం గొప్ప విషయం అని పలువు ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. బిల్‌గేట్స్ తన మాజీ భార్య మెలిండా ఫ్రెంచ్ గేట్స్‌తో ముగ్గురు పిల్లలను కన్నారు. వారు జెన్నిఫర్ (28), రోరీ (25), ఫోబ్.

## భారత కార్బన్ మార్కెట్ ప్రారంభం..

**కీలకంగా కార్బన్ క్రెడిట్ సర్టిఫికేట్లు భారత్‌తోపాటు ప్రపంచం అంతటా వాతావరణ కాలుష్యం ప్రధాన సమస్యగా మారుతోంది. ఇందుకు కార్బన్ ఉద్గారాలు కీలకంగా ఉన్నాయి. వివిధ ఉత్పత్తుల తయారీలో భాగంగా వీటిని విడుదల చేస్తున్న కంపెనీలపై కాలుష్య నియంత్రణ ప్రభావం పడుతుంది. ముఖ్యంగా అల్యూమినియం, సిమెంట్, క్లోర్-ఆల్కలీ, పేపర్ ఇండస్ట్రీల్లో 282 యూనిట్లకు నిర్దిష్ట ఉద్గార తీవ్రత లక్ష్యాలను నోటిఫై చేయడం ద్వారా గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాల సమస్యను కొంతవరకు కట్టడి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కర్బన ఉద్గారాలను నియంత్రించడం, పరిశ్రమల్లో స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా కార్యాచరణను తయారుచేసింది. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ మార్గదర్శకాల ప్రకారం పవర్ ఎక్స్చేంజీల్లో కార్బన్ క్రెడిట్ సర్టిఫికేట్లు ట్రేడ్ కావడంతో భారతదేశం ఇటీవల తన కార్బన్ మార్కెట్‌ను ప్రారంభించింది.**

**కాంప్లయన్స్ కార్బన్ మార్కెట్**

పరిశ్రమలు ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాల మేరకే ఉత్పత్తులను తయారు చేయాల్సి ఉంటుంది. బాధ్యతాయుతమైన సంస్థలు (ఆబ్లిగేటెడ్ ఎంటిటీస్‌ఓఈ) ఉద్గార పరిమితులను చేరుకోవాలి. ఈ పరిమితుల కంటే అధికంగా ఉద్గారాలు ఉంటే చర్యలు తప్పవు. టన్ను కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించినా లేదా నివారించినా కార్బన్ క్రెడిట్ సర్టిఫికేట్లను జారీ చేస్తారు. ఈ ధ్రువీకరణ పత్రాలను రెగ్యులేటర్లకు సమర్పించాల్సి ఉంటుంది. వీటిని పాటించనందుకు జరిమానాలు సైతం విధించేలా నిబంధనలు సిద్ధం చేశారు.

**కార్బన్ క్రెడిట్ సర్టిఫికేట్లు అంటే..**

ఒక టన్ను కార్బన్ డయాక్సైడ్ లేదా గ్రీన్ హౌస్ వాయువులు నివారిస్తే కంపెనీలకు ప్రత్యేకంగా ఇచ్చే సర్టిఫికేట్లు. కంపెనీలు కర్బన ఉద్గారాలను తగ్గించడానికి, ఆ దిశగా సంస్థలను ప్రోత్సహించడానికి వీటిని రూపొందించారు. ఒక ప్రాజెక్ట్ విజయవంతంగా ఉద్గారాలను తగ్గించినప్పుడు నియంత్రణ సంస్థలు లేదా స్వతంత్ర సంస్థల ద్వారా కార్బన్ క్రెడిట్ సర్టిఫికేట్‌లు జారీ చేస్తారు. ఉదాహరణకు, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు లేదా అడవుల పెంపకం కార్యక్రమాలతో ఈ క్రెడిట్లను సంపాదించవచ్చు.

## గోల్డ్ డౌన్.. నగల బంగారం

# రూ.90 వేల దిగువకు..

**దేశంలో భారీగా పెరిగి తారాస్థాయికి చేరిన బంగారం ధరలు దిగివస్తున్నాయి. వరుసగా ఆరో రోజూ తగ్గుముఖం పట్టాయి. నేడు (ఏప్రిల్ 28) పసిడి ధరలు భారీగా తగ్గాయి. ఇటీవల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.లక్ష దిగువకు వచ్చేసిన సంగతి తెలిసిందే. అలాగే ఈరోజు తగ్గుదలతో 22 క్యారెట్ల నగల బంగారం రూ.90 వేల దిగువకు వచ్చేసింది.**

అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు, డాలర్‌తో రూపాయి మారకం రేటు, స్థానిక డిమాండ్ వంటి అంశాలు భారత్‌లో పసిడి ధరలపై ప్రభావం చూపుతున్నాయి. ఏప్రిల్ 28 నాటికి దేశంలోని ప్రధాన నగరాల్లో 24 క్యారెట్, 22 క్యారెట్ బంగారం ధరలు ఈ విధంగా ఉన్నాయి..

**తెలుగు రాష్ట్రాల్లో..**

- 24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.97,530
- 22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.89,400

హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో బంగారం ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ, స్థానిక జ్యువెలరీ షాపుల్లో మేకింగ్ ఛార్జీలు,జీఎస్టీ కారణంగా కొంత వ్యత్యాసం కనిపిస్తుంది. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు వరుసగా రూ.680, రూ.620 చొప్పున తగ్గాయి.

**చెన్నైలో..**

- 24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.97,530
- 22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.89,400

చెన్నైలో బంగారం ధరలు ఇతర నగరాలతో పోలిస్తే కొంచెం ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ పోర్ట్ సౌకర్యాలు, డిమాండ్ ఈ ధరలను ప్రభావితం చేస్తున్నాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు వరుసగా రూ.680, రూ.620 చొప్పున తగ్గాయి.


**ఢిల్లీలో..**

- 24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.97,680
- 22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.89,550

ఢిల్లీలో బంగారం ధరలు రవాణా ఖర్చులు, స్థానిక ట్యాక్స్‌ల కారణంగా కొంత ఎక్కువగా ఉన్నాయి. అయితే ఈ నగరంలో బంగారం కొనుగోలుదారులు హాల్‌మార్క్ ఆభరణాలపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు వరుసగా రూ.630, రూ.620 చొప్పున తగ్గాయి.

**ముంబైలో..**

- 24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.97,530
- 22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.89,400



ముంబైలో బంగారం ధరలు స్థానిక డిమాండ్, జ్యువెలరీ డిజైన్‌లపై ఆధారపడి మారుతూ ఉంటాయి. ఈ నగరంలో బంగారం కొనుగోలు చేసే ముందు పలు జ్యువెలరీ షాపుల ధరలను సరిపోల్చడం మంచిది. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు వరుసగా రూ.680, రూ.620 చొప్పున తగ్గాయి.

**బెంగళూరులో..**

- 24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.97,530
- 22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.89,400

బెంగళూరులో బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయి, కానీ స్థానిక ఆర్థిక పరిస్థితులు, ఫెస్టివల్ సీజన్ డిమాండ్ ఈ ధరలను ప్రభావితం చేయవచ్చు. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు వరుసగా రూ.680, రూ.620 చొప్పున తగ్గాయి.

**బంగారం ధరల మార్పునకు కారణాలు భారత రూపాయి విలువ, దిగుమతి సుంకాలు, స్థానిక ట్యాక్స్‌లు, రవాణా ఖర్చులు ధరలలో వ్యత్యాసాలకు కారణమవుతున్నాయి. అదనంగా, భారతదేశంలో వివాహ సీజన్, పండుగల సమయంలో బంగారం డిమాండ్ పెరగడం వల్ల ధరలు కొంత పెరిగే అవకాశం ఉంది. బంగారం కొనుగోలు చేసే ముందు, హాల్‌మార్క్ సర్టిఫికేషన్‌ను తప్పనిసరిగా తనిఖీ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ హాల్‌మార్క్ బంగారం స్వచ్ఛతను నిర్ధారిస్తుంది. అలాగే, వివిధ జ్యువెలరీ షాపుల్లో ధరలు, మేకింగ్ ఛార్జీలను సరిపోల్చడం ద్వారా మంచి డీల్ పొందవచ్చు.**

**వెండి ధరలు ఇలా..**

**దేశవ్యాప్తంగా వెండి ధరలు కూడా నేడు భారీగా తగ్గాయి. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి కేజీకి రూ.900 మేర క్షీణించి రూ.1,11,000 వద్దకు తగ్గింది. అదే ఢిల్లీ ప్రాంతంలో అయితే అత్యధికంగా రూ.1400 తగ్గి రూ. 1,00,500 వద్ద కొనసాగుతోంది.**

## వెయ్యి పాయింట్లు పెరిగిన సెన్సెక్స్..

# రిలయన్స్ 5% జంప్

**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 1006 పాయింట్లు, నిఫ్టీ 289 పాయింట్లు చొప్పున లాభపడ్డాయి.**

**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. ఓ వైపు భారత్- పాక్ మధ్య ద్వైపాక్షిక ఉద్రిక్తతలు కొనసాగుతున్నా.. విదేశీ మదుపర్ల పెట్టుబడులు కొనసాగుతుండడం, మెరుగైన త్రైమాసిక ఫలితాల కారణంగా మన సూచీలు రాణించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో బీఎస్ఈ సెన్సెక్స్ వెయ్యికి పైగా పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 24,300 ఎగువన ముగిసింది. అయితే, భౌగోళిక ఉద్రిక్తతలను మదుపర్లు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని విశ్లేషకులు సూచిస్తున్నారు.**

సెన్సెక్స్ ఉదయం 79,343.63 (క్రితం ముగింపు 79,212.53) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 80,321.88 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1005.84 పాయింట్ల లాభంతో 80,218.37 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 289.15 పాయింట్ల లాభంతో 24,328.50 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 37 పైసలు బలపడి 85.04గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్, సన్‌ఫార్మా, టాటా స్టీల్, ఎస్‌బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అల్ట్రాటెక్ సిమెంట్, నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, ఎటర్నల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,288 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



**కారణాలు ఇవీ..**

క్యూ4 ఫలితాల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ అంచనాలను మించి రాణించింది. దీంతో నేడు కంపెనీ షేరు దాదాపు 5 శాతం మేర పెరిగి రూ.1366కు చేరింది. దీనికితోడు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వంటి బ్యాంకింగ్ రంగ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి.

గత కొన్ని రోజులుగా విదేశీ సంస్థాగత మదుపర్లు భారత ఈక్విటీల్లో కొనుగోళ్లు చేపడుతున్నారు. ఇది మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది. గత 8 ట్రేడింగ్ సెషన్లలో దాదాపు రూ.32 వేల కోట్ల విలువైన ఈక్విటీలను ఎఫ్‌ఐఐలు కొనుగోలు చేశారు.

టారిఫ్‌ల విషయంలో అమెరికాచైనాల మధ్య త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదరొచ్చన్న సంకేతాలు కూడా అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ రాణించడానికి కారణమని అనలిస్టులు చెబుతున్నారు.

పహల్గాం ఉగ్రదాడి ఘటనతో భారత్ పాక్‌ల మధ్య ఉద్రిక్తతల భయాలు ఓవైపు కొనసాగుతున్నా.. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి పాజిటివ్ సంకేతాలు, డాలర్ బలహీన పడడం, క్రూడాయిల్ ధరలు 6667 డాలర్ల మధ్య ట్రేడవుతుండడం వంటివి మన మార్కెట్లకు సానుకూలంగా మారాయి.

## హైదరాబాద్‌లో బిర్లా

# ఓపస్ పెయింట్ స్టూడియో

**హైదరాబాద్: ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ గ్రాసిమ్ ఇండస్ట్రీస్‌లో భాగమైన 'బిర్లా ఓపస్ పెయింట్స్'.. ఈరోజు హైదరాబాద్‌లో తన బిర్లా ఓపస్ పెయింట్ స్టూడియోను (కంపెనీ యాజమాన్యంలోని కంపెనీ ఆపరేటెడ్ ఎక్స్‌పీరియన్స్ స్టోర్) ప్రారంభించామని ప్రకటించింది. గురుగ్రామ్, లక్నో, ముంబయి, నవీ ముంబయి, బెంగళూరులో ఇప్పటికే విజయవంతంగా ప్రారంభించిన అనంతరం, పెయింట్, డెకర్ పరిశ్రమను ఆవిష్కరణ, ప్రీమియం ఆఫర్‌లు, నిజంగా లీనమయ్యే కస్టమర్ అనుభవం ద్వారా మార్చాలనే బ్రాండ్ నిబద్ధతను ఈ విస్తరణ మరింత బలోపేతం చేస్తుంది.**

బిర్లా ఓపస్ పెయింట్స్ హైదరాబాద్ స్టూడియో సాధారణ రిటైల్ ప్రయాణాన్ని స్ఫూర్తిదాయకమైన, లీనమయ్యే అనుభవంగా మార్చడానికి ఆలోచనాత్మకంగా రూపొందించారు. ఈ పెయింట్ స్టూడియో సంప్రదాయ పెయింట్ దుకాణాలకు అతీతంగా సృజనాత్మకతకు కేంద్రంగా తీర్చిదిద్దారు. ఇది ఒక ఎక్స్‌పీరియన్స్ కేంద్రం. ఇది వినియోగదారుల సృజనాత్మకతను మరింత కొత్తగా ఆవిష్కరించుకునేందుకు, నిజ జీవిత వాతావరణంలో రంగులను తాకడానికి, అనుభూతి చెందడానికి మరియు ఆస్వాదించేందుకు అనుమతిస్తుంది.

వినియోగదారుల వ్యక్తిగతీకరించిన గైడ్ ద్వారా షేడ్ ఎంపిక, టెక్చర్‌లు, వినియోగించే నైపుణ్యాలపై నిపుణుల నుంచి ఉచిత మార్గదర్శకత్వాన్ని



కూడా పొందవచ్చు. అధునాతన విజువలైజేషన్ సాధనాలు ఇంటి యజమానులు వారు ఎంచుకున్న రంగులు నిజ జీవిత సెట్టింగ్‌లలో ఎలా కనిపిస్తాయో ముందస్తుగా వీక్షించేందుకు సహాయపడతాయి. పెయింట్‌లకు మించి, పెయింట్ స్టూడియో వాల్‌కవరింగ్‌లు, డిజైనర్ ఫినిషింగ్‌లు మరియు సమగ్ర డెకర్ సొల్యూషన్ కోసం స్పెషాలిటీ కోటింగ్ ఎంపికలను కూడా కలిగి ఉంది.

ఈ స్టోర్ 170 కంటే ఎక్కువ ఉత్పత్తులను ప్రదర్శించడమే కాకుండా, రంగుల ఎంపికపై నిపుణుల సంప్రదింపులు, వినూత్న అప్లికేషన్ టెక్నిక్‌లు, గొప్ప స్థానిక వారసత్వం నుంచి ప్రేరణ పొందిన క్యూరేటెడ్ డెకర్ సొల్యూషన్‌లతో సహా పలు ప్రత్యేక సేవలను అందిస్తుంది. ఇది స్థానిక అభిరుచులు, వారసత్వానికి అనుగుణమైన ఎంపికలతో శక్తివంతమైన నగర స్ఫూర్తిని ప్రతిబింబించే ప్రత్యేకమైన షేడ్‌స్‌ను క్యూరేటెడ్ డెకర్ ప్యాకేజీలను అందిస్తుంది.

దేశ వ్యాప్తంగా.. తన రిటైల్ పాదముద్రను విస్తరించే లక్ష్యంతో బిర్లా ఓపస్ పెయింట్స్ వృద్ధి వ్యూహంలో ఈ ప్రారంభం కూడా ఒక ముఖ్యమైన అడుగు. అనుభవపూర్వక రిటైల్‌పై దృష్టి సారించి, రాబోయే నెలల్లో ఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కతా, జైపూర్, అహ్మదాబాద్ మరియు సూరత్‌లలో అదనపు అనుభవ కేంద్రాలను ప్రారంభించాలని కంపెనీ యోచిస్తోంది.

బిర్లా ఓపస్ పెయింట్స్ సీఈఓ రక్షిత్ హర్గవే మాట్లాడుతూ, "హైదరాబాద్‌లోని మా కొత్త పెయింట్ స్టూడియో కేవలం రిటైల్ స్థలం మాత్రమే కాదు, ఇది మీ పెయింటింగ్ అవసరాలకు ఒక అనుభవ కేంద్రం. అత్యాధునిక సాంకేతికత నుంచి స్థానికంగా ప్రేరణ పొందిన షేడ్ ప్యాలెట్‌ల వరకు, వినియోగదారులు, నిపుణులు అన్వేషించేందుకు, ప్రయోగాలు చేయడానికి, వ్యక్తీకరించడానికి మేము ఒక స్థలాన్ని సృష్టిస్తున్నాము. భారతదేశం పెయింట్‌లతో నిమగ్నమయ్యే విధానాన్ని మార్చడానికి, పెయింటింగ్ ప్రయాణాన్ని మరింత వ్యక్తిగతీకరించేందుకు, లీనమయ్యేలా.. స్ఫూర్తిదాయకంగా మార్చడానికి మా నిబద్ధతను ఈ స్టూడియో ప్రతిబింబిస్తుంది" అని వివరించారు.

BIRLA opus PAINTS





## తనతో మాట్లాడనిదే నాకేమీ తోచదు

హీరో మోహన్‌లాల్ వైవిధ్యమైన పాత్రలతో ఆకట్టుకుంటూ ఇటు తెలుగు ప్రేక్షకుల్నీ సైతం మెప్పిస్తున్నారు. అయితే, తాజాగా ఆయన కొన్ని ఆసక్తికర విశేషాలు చెప్పుకొచ్చారు. తన కెరీర్ గురించి మాట్లాడుతూ.. 'నలభై ఎనిమిదేళ్ల కెరీర్‌లో నేను సినిమాను ప్రేమించినంతగా దేన్నీ ప్రేమించలేదు. ఒక సినిమా సెట్స్ మీద ఉండగానే నాలుగైదు చిత్రాలకు ఓకే చెబుతుంటా. నిజానికి నాకు విశ్రాంతి తీసుకోవడం, ఖాళీగా ఉండటమంటే అస్సలు నచ్చదు. అందుకే, ఎప్పుడూ సినిమాల్లో బిజీగా ఉంటాను' అంటూ మోహన్ లాల్ చెప్పుకొచ్చారు.మోహన్ లాల్ తన కోరిక గురించి మాట్లాడుతూ.. 'మమ్ముట్టి నా ప్రాణ స్నేహితుడు. తనతో కలిసి దాదాపు యాభై సినిమాల్లో నటించాను . ఇంకా మరిన్ని చిత్రాల్లో కలిసి పని చేయాలనేదే నా కోరిక. రోజుకి ఒక్కసారైనా తనతో మాట్లాడనిదే నాకేమీ తోచదు. మా మధ్య పోటీ ఉంది అని అందరూ అనుకుంటారు. కానీ, మా మధ్య మంచి స్నేహం ఉంది' అని మోహన్ లాల్ చెప్పారు. అలాగే, తాను అయ్యప్ప స్వామి భక్తుణ్ని. అప్పుడప్పుడు మాల వేసుకుని.. కాలినడకన శబరిమల వెళ్లి ఇరుముడి

## చైతూ-శోభిత గుడ్ న్యూస్ చెప్పబోతున్నారా?

అక్కినేని హీరో నాగచైతన్య.. సోషల్ మీడియాలో పెద్దగా యాక్టివ్ ఉండడు. సినిమాల రిలీజ్ టైంలో తప్పితే పోస్టులు కూడా పెద్దగా పెట్టడు. కానీ రీసెంట్ గా ఆదివారం ఇలా గడిచింది అని ఓ రెండు మూడు ఫొటోలు పోస్ట్ చేశాడు. ఇక్కడ వరకు బాగానే ఉంది. కానీ తర్వాతే అకస్మాత్తుగా ఓ రూమర్ బయటకొచ్చింది.

గతంలో హీరోయిన్ సమంతని ప్రేమించి పెళ్లి చేసుకున్న నాగచైతన్య.. నాలుగేళ్లకే విడాకులు ఇచ్చేశాడు. కొన్నాళ్ల పాటు సింగిల్ గానే ఉన్నాడు. కానీ గతేడాది డిసెంబరులో తెలుగమ్మాయి, హీరోయిన్ శోభితని పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతానికైతే వీళ్లిద్దరూ ఫ్యామిలీ లైఫ్ ని ఎంజాయ్ చేస్తున్నారు.

అయితే సడన్ గా శోభిత ప్రెగ్నెంట్ అయ్యిందని రూమర్స్ వినిపిస్తున్నాయి. కానీ ఇందులో ఏ మాత్రం నిజం లేదని తెలుస్తోంది. అసలు ఈ పుకారు ఎవరు ఎందుకు సృష్టించారో గానీ సడన్ గా అంతటా వైరల్ అవుతోంది.

శోభిత విషయానికొస్తే గతేడాది మంకీ మ్యాన్, లవ్ సితార అనే సినిమాలతో ప్రేక్షకుల్ని పలకరించింది. ప్రస్తుతానికైతే కొత్త మూవీస్ గానీ వెబ్ సిరీసులు గానీ చేయట్లేదు. అక్కినేని ఫ్యామిలీ నుంచి క్లారిటీ వస్తే తప్ప ఈ రూమర్స్ ఆగవేమో!

## 'రాజమౌళి' అంతిమ లక్ష్యం అదేనట !



ప్రముఖ రచయిత, రాజ్యసభ ఎంపీ విజయేంద్ర ప్రసాద్ తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పలు ఇంట్రెస్టింగ్ విషయాలు చెప్పారు. విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. 'ఏ విధంగా ఇండియా రిచ్ ?' అని అడిగినప్పుడు.. కథల విషయంలో అని చెప్పానని తెలిపారు. మహాభారతం, రామాయణంలాంటి ఇతిహాసాలు మన ఆస్తులని విజయేంద్ర ప్రసాద్ చెప్పుకొచ్చారు. అలాగే, 'బజరంగీ భాయిజాన్' సీక్వెల్, ఆమిర్ ఖాన్ డ్రీమ్ ప్రాజెక్టు గురించి విజయేంద్ర ప్రసాద్ కామెంట్స్ చేశారు.ఇంతకీ, విజయేంద్ర ప్రసాద్ ఏం కామెంట్స్ చేశారంటే.. 'కొన్ని రోజుల క్రితం సల్మాన్‌ఖాన్‌ను కలిశా. 'బజరంగీ భాయిజాన్' కొనసాగింపునకు సంబంధించి ఓ పాయింట్ చెప్పాను. అది ఆయనకు చాలా బాగా నచ్చింది. మరి ఏం జరుగుతుందో చూద్దాం. 'మహాభారతం' ప్రాజెక్టు కోసం ఆమిర్ నన్ను ఓసారి కలిశారు. ఆ తర్వాత ఏమైందో నాకు తెలియదు' అని విజయేంద్ర ప్రసాద్ తెలిపారు. ఇక రాజమౌళి అంతిమ లక్ష్యం 'మహాభారతం' అని ఓ ప్రశ్నకు సమాధానంగా విజయేంద్ర ప్రసాద్ చెప్పారు.

## ఐటమ్ సాంగ్ లో దక్షా నాగర్కర్ చిందులు !

హాట్ బ్యూటీ దక్షా నాగర్కర్ కొరియన్ కనకరాజు మూవీ కోసం ఐటమ్ సాంగ్ లో నటిస్తూ సందడి చేస్తుంది. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, రితికా నాయక్ లు జంటగా నటిస్తున్న కొరియన్ కనకరాజు మూవీ షూటింగ్ వేగంగా సాగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ లోని ఆచార్య సెట్ లో ఒక ఐటమ్ సాంగ్ లో వరుణ్ తేజ్ తో కలిసి దక్షా నాగర్కర్ చిందులేస్తుంది. ముంబై బ్యూటీ దక్షా నాగర్కర్ టాలీవుడ్ లోకి ఏకే రావు పీకే రావు సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. హోరా హోరీ, హుషారు, జాంబీ రెడ్డి సినిమాలతో యూత్ లో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. బంగార్రాజు సినిమాలో నాగ చైతన్యతో స్పెషల్ సాంగ్ లో మెరిసింది. రవితేజ రావణాసుర, లవ్ మీ, శ్వాగ్ సినిమాల్లో మెరిసింది. సోషల్ మీడియాలో అభిమానులతో టచ్ లో ఉండే దక్షా హాట్ హాట్ ఫొటోలతో కుర్రకారు మతిపోగొడుతోంది. తాజాగా ఈ బ్యూటీ కొరియన్ కనకరాజుతో ఐటమ్ సాంగ్ లో అందాల ఆరబోతతో మరోసారి అభిమానులకు నిద్ర పట్టకుండా చేస్తుంది.



## 'రాజమౌళి' సినిమా రిలీజ్ పై నాని క్లారిటీ !

దర్శకధీరుడు రాజమౌళి - మహేష్ బాబు సినిమాను హాలీవుడ్ స్థాయిలో నిర్మించబోతున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ గా ప్రియాంక చోప్రా నటిస్తోంది. ఐతే, ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందని ఎవరికీ క్లారిటీ లేదు. కానీ, తాజాగా హీరో నాని ఈ సినిమా రిలీజ్ పై క్లారిటీ ఇచ్చారు. 'హిట్ 3' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నాని మాట్లాడుతూ.. 'రాజమౌళి, మహేశ్ బాబు సినిమా ఇంకో ఏడాదిలో రాబోతోందని, సినిమాను ప్రపంచమంతా చూసి తీరాల్సిందేనని హీరో నాని అన్నారు.ఏదిఏమైనా పాన్ ఇండియా మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఈ సినిమా కోసం చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కాగా ఆ మధ్య విజయేంద్రప్రసాద్ ఈ సినిమా కథ గురించి ఓ ఇంటర్వ్యూలో చెబుతూ.. 'నేను, రాజమౌళి ఇద్దరం దక్షిణాఫ్రికా నవలా రచయిత విల్బర్ స్మిత్ కు పెద్ద అభిమానులం. అందుకే ఆయన పుస్తకాల ఆధారంగానే ఈ సినిమా స్క్రిప్ట్ ను రాశాను' అంటూ చెప్పుకొచ్చారు. కాబట్టి రాజమౌళి - మహేష్ సినిమా ఒక అడ్వెంచర్ థ్రిల్లర్ గా ఉండబోతుంది. ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. విజయేంద్రప్రసాద్ కథ, దేవా కట్టా సంభాషణలు అందిస్తున్నారు.



ముద్దుగుమ్మ 'రకుల్ ప్రీత్ సింగ్' గ్లామరస్ ఫోజులు ప్రస్తుతం కుర్రకారుకు మత్తెక్కిస్తున్నాయి. ఈ పిక్స్ తో రకుల్ ప్రీత్ సింగ్ మళ్లీ సోషల్ మీడియాలో ఫుల్ క్రేజ్ సొంతం చేసుకుంది. పైగా అభిమానులతో నిత్యం టచ్ లోనే ఉంటుంది. కుర్రాళ్ల హృదయాల్లో కల్లోలం సృష్టించేందుకు ఎప్పటికప్పుడు రకుల్ ప్రీత్ సింగ్ తనదైన శైలిలో కసరత్తులు చేస్తోంది. ఈ క్రమంలో రకుల్ ప్రీత్ సింగ్ ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ చేసిన హాట్ పిక్స్ ప్రస్తుతం యువతకు మంచి కిక్కిచ్చేలా ఉన్నాయి.

## చీరలో రకుల్ బ్లాస్టింగ్ ఫోజులు

రకుల్ డిఫరెంట్ స్టైల్లో చీర కట్టి, అందమైన జ్యువెల్లరీ ధరించి తన అందాలతో కుర్రకారును మాయ చేస్తుంది. ప్రస్తుం దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట్లో తెగ వైరల్ అవుతున్నాయి. హాట్ డ్రెస్ లో బోల్డ్ బాంబ్ లా క్లీవేజ్ పరువాలతో రకుల్ విస్ఫోటనం సృష్టించింది. చూపులు తిప్పుకోలేని విధంగా ఎలాంటి గ్లామర్ హద్దులు లేకుండా రకుల్ ప్రీత్ సింగ్ ఈ ఫొటోల్లో చెలరేగిపోయింది. మొత్తమ్మీద రకుల్ ప్రీత్ సింగ్ అందాలకు కుర్రాళ్లు ఫిదా అవుతున్నారు.



## మెగాస్టార్ సినిమాలో హీరోయిన్‌గా..?

ప్రస్తుతం టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న క్రేజీ కాంబోల్లో మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కూడా ఒకటి. వీరిద్దరి కాంబోలో తెరకెక్కుతున్న ప్రాజెక్ట్ కోసం అభి మానులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో అందరికీ తెలిసిందే. 'సంక్రాంతికి వస్తున్నాం'తో టాలీవుడ్‌లో సెన్సేషనల్ హిట్ అందుకున్నాడు అనిల్ రావిపూడి.

ఇక ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవితో ఆయన సినిమా చేస్తుండటంతో ఈ మూవీపై ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు నెలకొన్నాయి. అయితే, ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఇండస్ట్రీ వర్గాల్లో ఓ క్రేజీ న్యూస్ చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో చిరు సరసన అందాల భామ నయనతార హీరోయిన్‌గా నటించబోతున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

గతంలో 'గాడ్‌ఫాదర్' చిత్రంలో చిరు చెల్లిగా నయనతార నటించిన సంగతి అందరికీ తెలిసిందే. మరి ఇప్పుడు చిరు సరసన ఆమె హీరోయిన్‌గా నటిస్తుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.





## రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకున్న అశ్విన్!

**టీమిండియా మజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్నాడు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో.. ఈ అవార్డును అశ్విన్ స్వీకరించాడు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, ఇతర ప్రముఖులు కూడా హాజరయ్యారు.**

కాగా భారత క్రికెట్‌కు అందించిన సేవలకు గాను అశ్విన్‌కు ఈ అరుదైన గౌరవం లభించింది. ఈ ప్రత్యేక గౌరవం పొందినందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి అశ్విన్‌ను ప్రశంసించింది. "భారత రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ అవార్డును అందుకున్న అశ్విన్‌కు అభినందనలు. ఇది అతడి కెరీర్‌లో సాధించిన అద్భుత విజయాలకు దక్కిన గౌరవమని" బీసీసీఐ ఎక్స్‌లో రాసుకొచ్చింది. అశ్విన్ తన 15 ఏళ్ల కెరీర్‌లో భారత్ తరపున 287 మ్యాచ్‌లు ఆడాడు. అందులో 106 టెస్టులు, 116 వన్డేలు, 65 టీ20లు ఉన్నాయి. 106 టెస్టుల్లో అశ్విన్ 537 వికెట్లు పడగొట్టాడు. భారత్ తరపున టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన రెండో ఆటగాడిగా ఈ తమిళనాడు క్రికెటర్ కొనసాగుతున్నాడు. వన్డేల్లో 156 వికెట్లు, టీ20ల్లో 72 వికెట్లు పడగొట్టాడు.

అశ్విన్‌తో పాటు భారత హాకీ దిగ్గజం పిఆర్ శ్రీజేష్‌ను పద్మభూషణ్ అవార్డుతో సత్కరించారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ కాంస్య పతకాన్ని గెలుచుకోవడంలో శ్రీజేష్ కీలక పాత్ర పోషించాడు. పారిస్ ఒలింపిక్స్ అనంతరం శ్రీజేష్ హాకీకి రిటైర్మెంట్ ప్రకటించాడు.



## 2028 నుంచి ఐపీఎల్‌లో 94 మ్యాచ్‌లు?

**ప్రస్తుతం ఐపీఎల్‌లో ప్రతి సీజన్‌లో 74 మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. టోర్నీని మరో 20 మ్యాచ్‌లకు విస్తరించాలని బీసీసీఐ యోచిస్తోందని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ వెల్లడించారు.**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ ను మరో 20 మ్యాచ్‌లకు విస్తరించాలని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు యోచిస్తోందని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ వెల్లడించారు. అయితే, ఇప్పట్లో కొత్త ఫ్రాంఛైజీలను ప్రవేశపెట్టే ఆలోచన లేదన్నారు. ప్రస్తుతం ఉన్న ఐపీఎల్ మీడియా హక్కుల కాలపరిమితి 2027 వరకు ఉంది. తదుపరి ఐపీఎల్ మీడియా హక్కుల సైకిల్ ప్రారంభంకానుంది. అప్పటి నుంచి 94 మ్యాచ్‌లు నిర్వహించేందుకు అవకాశాలు ఉన్నాయని ఐపీఎల్ ఛైర్మన్ తెలిపారు. 'దీని గురించి ఐసీసీలో చర్చిస్తున్నాం. బీసీసీఐలోనూ అంతర్గత చర్చ జరుగుతోంది. ఫ్రాంఛైజీ క్రికెట్, టీ20 క్రికెట్, ద్వైపాక్షిక సిరీస్‌లు, ఐసీసీ ఈవెంట్‌లకు సంబంధించి అభిమానుల ఆసక్తి ఎలా మారుతోంది అనే విషయాలపై మేం మరింత లోతుగా చర్చించాల్సిన అవసరముంది. టోర్నీని విస్తరించాలంటే మ్యాచ్‌లను 74 నుంచి 84 లేదా 94కి పెంచాలి. ప్రతి జట్టు మిగతా అన్ని జట్లతో రెండేసి మ్యాచ్‌లు (సొంత మైదానంలో ఒకటి, ప్రత్యర్థి మైదానంలో ఒకటి) 94 మ్యాచ్‌లు నిర్వహించాల్సి ఉంటుంది' అని అరుణ్ ధుమాల్ వివరించారు.

**ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం ఇది**

ప్రస్తుతం ప్రతి సీజన్‌లో ప్లేఆఫ్స్‌తో కలిపి 74 మ్యాచ్‌లు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఆయా జట్లు గెలిచిన టైటిళ్ల సంఖ్య, ఫైనల్, ప్లే ఆఫ్స్ చేరిన సంఖ్య ఆధారంగా 10 జట్లకు సీడింగ్ ఇచ్చి రెండు గ్రూప్‌లుగా విభజించారు. ఒకే గ్రూప్‌లో ఉన్న జట్ల మధ్య రెండేసి మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ప్రత్యర్థి గ్రూప్‌లో తమతో సమానంగా ఉన్న జట్టుతో రెండుసార్లు... మిగతా జట్లతో ఒకసారి తలపడుతున్నాయి. ఉదాహరణకు ఈ సారి ముంబయి ఇండియన్స్, ఆర్సీబీ వేర్వేరు గ్రూప్‌ల్లో ఉండటంతో ఒకే సారి తలపడ్డాయి. ముంబయి, సీఎస్కే వేర్వేరు గ్రూప్‌ల్లో ఉన్నా.. సేమ్ సీడింగ్ (ర్యాంకు) ఉండటంతో రెండు మ్యాచ్‌ల్లో తలపడ్డాయి.

## చరిత్ర సృష్టించిన సూర్యవంశీ..

# ప్రపంచంలోనే తొలి ప్లేయర్‌గా

**ఐపీఎల్-2025లో జైపూర్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర సెంచరీతో చెలరేగాడు. 210 భారీ లక్ష్య చేధనలో 14 ఏళ్ల చిచ్చరపిడుగు ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. సవాయ్ మాన్సింగ్ స్టేడియంలో వైభవ్ సిక్సర్ల వర్షం కురిపించాడు.**





మహ్మద్ సిరాజ్, ఇషాంత్ శర్మ, ప్రసిద్ద్ కృష్ణ వంటి వరల్డ్ క్లాస్ బౌలర్లను సూర్యవంశీ ఊతికారేశాడు. అతడిని ఆపడం ఎవరి తరం కాలేదు. ఈ క్రమంలో వైభవ్ కేవలం 35 బంతుల్లోనే తన ఐపీఎల్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఓవరాల్‌గా 38 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్స్‌లతో 101 పరుగులు చేసి ఔటయ్యాడు.

అతడి ఇన్నింగ్స్‌కు ప్రత్యర్ధి ఆటగాళ్లు సైతం ఫిదా అయిపోయారు. సూర్యవంశీ ఔటై పెవిలియన్‌కు వెళ్తుండగా స్టేడియంలో అందరూ నిలిచి స్టాండింగ్ ఓవియేషన్ ఇచ్చారు. ఇక మెరుపు సెంచరీతో చెలరేగిన సూర్యవంశీ పలు అరుదైన రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు.

**సూర్యవంశీ సాధించిన రికార్డులు ఇవే..**

- ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ఇండియన్ ప్లేయర్‌గా వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. ఇంతకుముందు ఈ రికార్డు భారత మాజీ ప్లేయర్ యూసఫ్ పఠాన్ పేరిట ఉండేది. 2010 సీజన్‌లో ముంబై పై రాజస్తాన్ తరపున యూసఫ్ 37 బంతుల్లో శతకం సాధించాడు. తాజా మ్యాచ్‌లో 35 బంతుల్లోనే సెంచరీ చేసిన సూర్యవంశీ.. యూసుఫ్ ఆల్‌టైమ్ రికార్డును బ్రేక్ చేశాడు.
- ఓవరాల్‌గా ఈ ఫీట్ సాధించిన రెండో ప్లేయర్‌గా వైభవ్ నిలిచాడు. ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన జాబితాలో క్రిస్ గేల్ (30 బంతులు) ఉన్నాడు.
- అదేవిధంగా టీ20 క్రికెట్‌లో సెంచరీ చేసిన అతి పిన్న వయష్కుడిగా వైభవ్ రికార్డులెక్కాడు. వైభవ్ సూర్యవంశీ 14 ఏళ్ల 32 రోజుల వయస్సులో ఈ ఫీట్‌ను అందుకున్నాడు. ఇంతకుముందు ఈ రికార్డు మహారాష్ట్ర ప్లేయర్ విజయ్ జోల్ (18 సంవత్సరాల 118 రోజులు) పేరిట ఉండేది. ఈ మ్యాచ్‌తో జోల్‌ను వైభవ్ అధిగమించాడు. అదేవిధంగా ఐపీఎల్‌లో హాఫ్ సెంచరీ, సెంచరీ చేసిన అతి పిన్న వయష్కుడు కూడా వైభవే కావడం విశేషం.

**టీ20ల్లో సెంచరీ చేసిన పిన్న వయష్కులు వీరే..**

- వైభవ్ సూర్యవంశీ(14 సంవత్సరాల 32 రోజులు)
- విజయ్ జోల్(18 సంవత్సరాల 118 రోజులు)
- పర్వేజ్ హొస్సేన్ ఎమోన్ (18 సంవత్సరాలు 179 రోజులు)
- గుస్తావ్ మెక్‌కీన్(18 సంవత్సరాల 280 రోజులు )

## వైభవ్ సూర్యవంశీ సంచలన ఇన్నింగ్స్..

# గుజరాత్‌పై రాజస్థాన్ ఘన విజయం

**గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.**



**జైపుర్:** వరుసగా ఐదు ఓటముల తర్వాత ఎట్టకేలకు రాజస్థాన్ మూడో విజయం సాధించింది. గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 8 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. అనంతరం రాజస్థాన్ 15.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. వైభవ్ సూర్యవంశీ (101: 38 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్స్‌లు) సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. 35 బంతుల్లోనే శతకం చేశాడు. ఐపీఎల్ చరిత్రలో ఇది రెండో అత్యంత వేగవంతమైన సెంచరీ. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ (70*: 40 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకంతో చెలరేగాడు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ, రషీద్ చెరో వికెట్ తీశారు.

**వైభవ్ ఊచకోత..**

210 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్.. వైభవ్, జైస్వాల్ తొలి వికెట్‌కు 166 పరుగుల భాగస్వామ్యం అందించారు. ఇటీవల గెలుపుతీరాలకు వచ్చి బోల్తా పడుతున్న రాజస్థాన్.. ఈమ్యాచ్‌లో మాత్రం ఎలాంటి వణకు బెణుకు లేకుండా చెలరేగింది. తొలి ఓవర్ నుంచే ఇద్దరు బ్యాటర్లు దంచికొట్టారు. తొలి ఓవర్ మూడో బంతికి సిరాజ్ బౌలింగ్‌లో సిక్స్‌తో ఖాతా తెరిచిన వైభవ్.. నాలుగో ఓవర్లో తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. ఇషాంత్ బౌలింగ్‌లో 6,6,4,0,6,4 పరుగులతో దంచికొట్టాడు. ఆ తర్వాతి ఓవర్లో జైశ్వాల్ ఫోర్ కొట్టగా, సూర్యవంశీ రెండు సిక్స్‌లు, ఒక ఫోర్ బాదాడు. దీంతో ఈ ఓవర్లో 21 పరుగులు వచ్చాయి. వైభవ్ 17 బంతుల్లోనే తన తొలి అర్ధ శతకం చేశాడు. దీంతో 5 ఓవర్లు ముగిసేసరికి రాజస్థాన్ 81 పరుగులతో నిలిచింది. ప్రసిద్ధ్ వేసిన 8వ ఓవర్లో జైస్వాల్ రెండు ఫోర్లు, వైభవ్ ఒక సిక్స్ కొట్టారు. కరీమ్ జనత్ వేసిన 10 ఓవర్లలో సూర్యవంశీ ఊచకోతకోశాడు. వరుసగా 6,4,6,4,4,6 ఏకంగా 30 పరుగులు రాబట్టాడు. దీంతో 10 ఓవర్లు ముగిసే సరికి రాజస్థాన్ 144 పరుగులతో నిలిచింది. ఆ తర్వాతి ఓవర్లోనే సిక్స్‌తో వైభవ్ ఐపీఎల్‌లో తన తొలి శతకం చేశాడు. ఐపీఎల్ చరిత్రలో భారత్ తరపున అత్యంత వేగంగా (35 బంతుల్లో) శతకం చేసిన వ్యక్తిగా వైభవ్ రికార్డుకెక్కాడు. మరోవైపు 31 బంతుల్లో జైస్వాల్ అర్ధశతకం చేశాడు. అయితే ప్రసిద్ధ్ వేసిన 12 ఓవర్లో వైభవ్ బౌల్డ్ అయ్యాడు. ఆతర్వాత వచ్చిన నితీశ్ రాణా స్వల్ప వ్యవధిలోనే రషీద్ ఖాన్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరిగాడు. అనంతరం రియాన్ పరాగ్‌తో కలిసి యశస్వి రాజస్థాన్‌ను గెలుపుతీరాలకు చేర్చాడు.

## భారత క్రికెట్‌లో నయా సంచలనం ప్రతీక..

# ఈమె గురించి తెలుసా?

**భారత మహిళల క్రికెట్‌లో మార్మోగుతున్న పేరు ప్రతీక రావల్ . మరో స్టార్ బ్యాటర్ తయారవుతోందనే అంచనాలు ఈ అమ్మాయిపై కలుగుతున్నాయి.**



ప్రతీక రావల్.. ప్రస్తుతం భారత మహిళల క్రికెట్‌లో మార్మోగుతున్న పేరు. అంతర్జాతీయ క్రికెట్లోకి ఈ అమ్మాయి అడుగుపెట్టి నాలుగు నెలలే అవుతోంది. కానీ, నిలకడగా రాణిస్తూ జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోంది. మిథాలీ రాజ్, హర్మన్ ప్రీత్, స్మృతి మంధాన, షెఫాలి వర్మల బాటలో మరో స్టార్ బ్యాటర్ తయారవుతోందనే అంచనాలు ఈ అమ్మాయిపై కలుగుతున్నాయి.

దిల్లీకి చెందిన 24 ఏళ్ల ప్రతీక రావల్ .. గతేడాది డిసెంబరు 22న అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగుపెట్టింది. దేశవాళీల్లో సత్తా చాటి భారత మహిళల వన్డే జట్టులో చోటు సంపాదించిన ప్రతీక.. వెస్టిండీస్‌తో తన తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడింది. ఓపెనింగ్ బ్యాటర్ అయిన ప్రతీక.. తొలి మ్యాచ్‌లోనే ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేస్తూ 69 బంతుల్లో 40 పరుగులు సాధించి బలమైన పునాది వేసింది. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. 76, 18, 89, 67, 154, 50 నాటౌట్.. తర్వాతి ఆరు వన్డే ఇన్నింగ్స్‌ల్లో ప్రతీక స్కోర్లు ఇవి. ఏడు మ్యాచ్‌ల్లో 82.33 సగటుతో ఆమె 494 పరుగులు సాధించింది. అందులో ఒక శతకం, నాలుగు అర్ధశతకాలు ఉన్నాయి.

వన్డే కెరీర్ తొలి పది మ్యాచ్‌ల్లోపు ఇంత గొప్ప గణాంకాలు నమోదు చేసిన భారత బ్యాటర్ మరొకరు లేరు. స్మృతి మంధానతో కలసి జట్టుకు అద్భుత ఆరంభాలందిస్తూ తక్కువ సమయంలోనే వన్డే జట్టులో కీలక బ్యాటర్‌గా ఎదిగింది. గత మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై భారీ శతకం బాదిన ఆమె.. తాజాగా శ్రీలంకలో ఆరంభమైన ముక్కోణపు వన్డే సిరీస్‌లో ఆతిథ్య జట్టుపై అజేయ అర్ధశతకంతో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఏడు వన్డేల్లో ప్రతీకకిది మూడో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు కావడం విశేషం. కుడిచేతి వాటం బ్యాటర్ అయిన ఆమెకు మంచి టెక్నిక్ ఉంది. అవసరమైతే దూకుడుగానూ ఆడగలదు. చక్కటి టైమింగ్‌తో షాట్లు కొడుతుంది. ఓపిగ్గా క్రీజులో నిలిచి సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడగల నైపుణ్యంతో విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది.

ప్రతీక ఉపయుక్తమైన ఆఫ్ స్పిన్నర్ కూడా. వెస్టిండీస్‌పై ఓ మ్యాచ్‌లో 2 వికెట్లు తీసింది. చక్కటి ఫీల్డింగ్‌తోనూ ఆకట్టుకుంటోంది. ఇదే నిలకడను కొనసాగిస్తే మేటి ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకునే అవకాశముంది. ఇదే దూకుడు కొనసాగిస్తే, త్వరలోనే ఆమెను టీ20 జట్టులోనూ చూడొచ్చు. వచ్చే ఏడాది మహిళల ప్రీమియర్ లీగ్‌లోకి ప్రతీక రావడం కూడా లాంఛనమే. గత వేలం సమయానికి ఆమె గురించి ఫ్రాంఛైజీలకు తెలియదు. అందుకే ఈ సీజన్‌లో ఆడలేదు. ప్రస్తుతం ఆమె నిలకడను చూస్తున్న ఫ్రాంఛైజీలు వచ్చే ఏడాది తన కోసం పోటీ పడితే ఆశ్చర్యమేమీ లేదు.

**ఆమె స్థానానికి ఎసరు**

ప్రతీక నిలకడగా రాణించడం వన్డే జట్టులో ఓ స్టార్ బ్యాటర్ స్థానానికి ఎసరు పెట్టింది. కొన్నేళ్లుగా వన్డే, టీ20 జట్లలో షెఫాలి వర్మనే రెగ్యులర్ ఓపెనర్. కానీ ఈ మధ్య ఆమె నిలకడ తప్పింది. దీంతో వన్డే జట్టు నుంచి తప్పించారు. ఆమె స్థానంలోకే ప్రతీక వచ్చింది. ఈ అవకాశాన్ని రెండు చేతులా ఉపయోగించుకుని చాలా వేగంగా జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోంది.

అయితే, కెరీర్ ఆరంభంలో మెరుపులు మెరిపించిన తర్వాత కనుమరుగైన బ్యాటర్లు చాలామందే ఉన్నారు. ప్రతీక అలా అవ్వకుండా జాగ్రత్త పడాలి. తన టెక్నిక్ చూస్తే సుదీర్ఘ కాలం జట్టులో నిలిచే స్థాయి ఉన్నట్లే కనిపిస్తోంది. స్టైలిష్ బ్యాటర్‌గానూ గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. నిలకడగా రాణిస్తే స్మృతి మంధాన తరహాలో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించగలదనే అంచనాలున్నాయి.